

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తోంది. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల విజయానికి కూటమి పార్టీల శ్రేణులు ఐక్యంగా పనిచేస్తాయి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



సోమవారం 12.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 172 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# స్థానిక పోరులో గెలుపే లక్ష్యం

- కూటమి అభ్యర్థుల విజయంతో ట్రిపుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడాలి
- బీసీలకు 40 శాతం సీట్లు.. రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం
- నేతల పనితీరుకు రేటింగ్స్.. 50 రోజుల పాటు క్షేత్రస్థాయిలోనే
- మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి, తెదేపా అధినేత చంద్రబాబు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నామని, స్థానిక ఎన్నికల్లోనూ కూటమి విజయంతో ట్రిపుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడేలా చూడాలని పిలుపునిచ్చారు. మంత్రులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, అబ్జర్వర్లు, పార్టీ ముఖ్య నేతలతో ఆదివారం వర్చువల్‌గా సమావేశమయ్యారు. స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రచారం, కూటమి పార్టీల మధ్య సమన్వయం, ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం తదితర అంశాలపై మార్గనిర్దేశం చేశారు.

**50 రోజుల పాటు క్షేత్రస్థాయిలోనే.. :** స్థానిక ఎన్నికలను ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దని చంద్రబాబు స్పష్టం చేశారు. "2024 ఎన్నికల కంటే ఎక్కువ శాతం ఓట్లు సాధించాలి. అదే నేతల పనితీరుకు కొలమానం. రానున్న 50 రోజులు కీలకం. ఎవరికీ మినహాయింపు లేదు. గెలుపే ధ్యేయంగా పనిచేయాలి. స్థానిక ఎన్నికల్లో నాయకుల పనితీరుకు రేటింగ్స్ ఇస్తాం. అందరూ బాధ్యతగా పనిచేయాలి" అని సూచించారు. కూటమి బలం మరింత పెరగాలంటే స్థానిక ఎన్నికలు కీలకమని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. రూ.1.50 లక్షల కోట్లను సంక్షేమానికి ఖర్చు చేశామని, అంతే మొత్తంలో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. సూపర్ సిక్స్ హామీలను విజయవంతంగా అమలు చేస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. చెత్త పన్ను రద్దు, పారిశుద్ధ్య మెరుగుదల, రహదారుల నిర్మాణం, సాగునీటి రంగానికి పూర్వవైభవం, భోగాపురం విమానాశ్రయం పనులు,

మిగతా 2లో...

## పేదలకు శాశ్వత హక్కులు



- రూ.600 కోట్ల విలువైన స్థలంపై 939 కుటుంబాలకు పట్టాలు
- వచ్చే సంక్రాంతికి నెల్లూరులో మరో 4 వేల మందికి పంపిణీ
- అసంపూర్తి టిడ్కో ఇళ్లను త్వరలో పూర్తి చేసి అప్పగిస్తాం
- వర్చువల్‌గా పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

2లో

## దసరా.. జనరంజకంగా జరగాలి

- సామాన్య భక్తులకే తొలి ప్రాధాన్యం
- ఇంద్రకీలాద్రి ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- విజయవాడ ఉత్సవ్ 2.0లో సంప్రదాయం.. సంబరం
- జాతీయ సరస్ మేళా దేశానికే ఆదర్శం కావాలి
- శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి.. సీఎం చంద్రబాబు ఆదేశం

2లో



## రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దు



- మున్సిపల్ ఎన్నికల్లో అమలుకు ప్రభుత్వ ఉత్తర్వులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ కోటాలన్నీ కలిపి పరిమితి
- సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ప్రక్రియ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి: పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు ఈ నిబంధన వర్తిస్తుందని పేర్కొంది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఆదివారం జీఓ నంబరు 251 విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లన్నీ కలిపి గరిష్ఠ పరిమితికి లోబడి ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**న్యాయస్థానాల ఆదేశాల మేరకు.. :** బీసీ రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి ప్రత్యేక కమిషన్ సిఫార్సులను ఆమోదిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అదే సమయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయనున్నట్లు స్పష్టం చేసింది.

మిగతా 2లో...

## గిరిజన బాటకు.. రూ.2,052 కోట్లు

### అడవితల్లి బాట 2.0 కింద 2,569 పనులకు శ్రీకారం



- 1,341 ఆవాసాలకు 1,976 కి.మీ. రహదారులు
- 45 వంతెనల నిర్మాణానికి నిధుల కేటాయింపు
- రహదారులు, వైద్యం, ఉపాధి సదుపాయాల విస్తరణ
- కాకవాడలో కార్యక్రమాన్ని ప్రారంభించిన పవన్ కల్యాణ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు అండగా నిలిచి, వారి విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. కూటమిలోని అన్ని పార్టీల నాయకులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగుతూ గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. కూటమి ఏర్పాటు, విజయం కోసం మన పార్టీ నాయకులు ఎన్నో త్యాగాలు చేశారని, వారి త్యాగాలను గుర్తిస్తూ పొత్తు ధర్మానికి అనుగుణంగా స్థానిక సంస్థల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం పోరాడామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు మన నాయకుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం, కూటమి కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం లభించేలా కూటమిలోని ప్రతి నాయకుడు అండగా నిలవాలని కోరారు. ఆదివారం పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కాకవాడలో అడవితల్లి బాట 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "2014లో కూటమికి మద్దతుగా నిలిచినప్పుడు ఏ ఒక్కరూ పదవులూ ఆశించలేదు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని భావించి నిస్వార్థంగా పని చేశారు. పార్టీ కోసం, కూటమి

మిగతా 3లో...



## చెన్నై మెట్రోకు పచ్చజెండా

- పూనమల్లి-వడపళని మార్గాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ, సీఎం విజయ్
- కొత్త మెట్రోలో కలిసి ప్రయాణించిన ఇరువురు నేతలు

**చెన్నై(జర్నలిస్ట్ ఫైల్) :** చెన్నై మహానగరంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. చెన్నై మెట్రో రైల్ ఫేజ్ 2లో భాగంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పూనమల్లి-వడపళని మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేడు కలిసి ప్రారంభించారు.

పోరూర్ బైపాస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరువురు నేతలు జెండా ఊపి తొలి రైలు సర్వీసును ప్రారంభించారు. అనంతరం కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించి, అందులోని సౌకర్యాలను పరిశీలించారు. కారిడార్ 4లో భాగంగా సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో ఈ కొత్త మార్గాన్ని నిర్మించారు. 15 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో మొత్తం 11 ఎలివేటెడ్ స్టేషన్లు ఉన్నాయి. మిగతా 2లో...



## ప్రపంచ పర్యాటక పటంలో ఏపీ

- స్పెయిన్‌లో మంత్రి కందుల దుర్గేష్ పర్యటన విజయవంతం
- అంతర్జాతీయ వేదికపై ఏపీ పర్యాటక ఆకర్షణల ప్రదర్శన
- 100కు పైగా ప్రాంతాల్లో ఏఐ ఆధారిత సమాచార సేవలు
- తీరప్రాంతం, ఆలయాలు, ఎకో టూరిజంలో పెట్టుబడులకు ఆహ్వానం

2లో

## సరస్ మేళా.. మహిళా శక్తికి జాతర

- అక్టోబరు 13 నుంచి విజయవాడ పున్నమి ఘాట్‌లో సందడి
- దేశవ్యాప్తంగా మహిళా సంఘాల ఉత్పత్తులకు జాతీయ వేదిక
- 576 స్టాళ్లు.. రాష్ట్రం నుంచి 208
- 'స్వయం ఏపీ' ఉత్పత్తుల విక్రయాలకు సువర్ణావకాశం
- నవరాత్రి ఉత్సవాలతో సందర్శకులకు మరో ఆకర్షణ
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశవ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామీణ కళాకారులు, పారిశ్రామికవేత్తల అద్భుతమైన ఉత్పత్తులకు జాతీయస్థాయిలో గొప్ప మార్కెటింగ్ వేదికగా ' జాతీయ సరస్ ఆజీవిక మేళా-2026 ' నిలుస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం పేర్కొన్నారు. విజయవాడలోని పున్నమి ఘాట్‌లో అక్టోబర్ 13 నుంచి 31 వరకు అత్యంత వైభవంగా జరిగే ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికత, కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో ఏర్పాటవుతోందని మంత్రి కొనియాడారు. ఈ మేళాలో రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు దేశం నలుమూలల నుంచి వచ్చే మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా

మిగతా 2లో...

## జిబౌటీ తీరంలో మృత్యుఘోష



- పడవ ప్రమాదంలో 109 మంది దుర్మరణం
- 116 మందికి పైగా గల్లంతు

**జిబౌటి :** ఆఫ్రికాలోని జిబౌటీ తీరంలో పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో 15మంది చిన్నారులు సహా 109మంది వలసదారులు మరణించినట్లు ఐక్యరాజ్యసమితి వలసల సంస్థ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మరో 116 మందికి పైగా గల్లంతయ్యారని వెల్లడించింది. మిగతా 2లో...

## లెక్కలున్నా.. విషప్రచారమా?

- కొనుగోళ్ల గణాంకాలు బయటపెట్టిన మంత్రి అచ్చెన్నాయుడు
- బహిరంగ చర్చకు జగన్‌కు సవాల్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రైతులకు మద్దతుగా చేపట్టిన పంట ఉత్పత్తుల కొనుగోళ్లను, వాటికి విడుదలైన నిధులను దాచిపెట్టి కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేయడం జగన్ కు , ఆయన మానస పుత్రిక సాక్షికి అలవాటుగా మారిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలను విస్మరించి, జగన్, వైసీపీ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కొనుగోళ్ల లెక్కలు ఉన్నాయి.. నిధుల విడుదల వివరాలు ఉన్నాయి.. కేంద్రానికి పంపిన ప్రతిపాదనల తేదీలు ఉన్నాయి. ఇవన్నీ పక్కనపెట్టి ప్రభుత్వంపై నిందలు వేస్తే అబద్ధం నిజమైపోతుందా? అని ప్రశ్నించారు. 2024-25 ఖరీఫ్ నుంచి 2025-26 రబీ వరకు మొత్తం 1,50,747 మంది రైతుల నుంచి 2,84,045.60 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులను కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ కొనుగోళ్లకు సంబంధించి రైతులకు చెల్లింపులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ ద్వారా ఏపీ మార్క్‌ఫెడ్‌కు మొత్తం రూ.1,944.43 కోట్లు విడుదల చేసిందని వివరించారు. 2024-25లో 71,376 మంది రైతుల నుంచి 1,22,970.60 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను కొనుగోలు చేయగా, అందుకు రూ.821.37 కోట్లు విడుదలయ్యాయని పేర్కొన్నారు.

మిగతా 3లో...

## స్థానిక పోరులో గెలుపే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారంలో ప్రస్తావించాలని సూచించారు. పల్లె పండుగ కింద రూ.11 వేల కోట్లు, జలజీవన్ మిషన్ పనులకు రూ.30 వేల కోట్లతో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలన్నారు.

**బీసీలకు 40 శాతం సీట్లు :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 40 శాతం మేర సీట్లు కేటాయిస్తామని చంద్రబాబు ప్రకటించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా లిలి'జయహో బీసీ! జనాభాలో సగం-కూటమి ఇచ్చింది బలం'లిలి పేరుతో ప్రచార కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చారు.

గతంలో బీసీలకు 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను వైకాపా ప్రభుత్వం 24 శాతానికి తగ్గించిందని చంద్రబాబు విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా, స్థానిక ఎన్నికలు జరగకుండా అడ్డుకునేందుకు వైకాపా న్యాయస్థానాలను ఆశ్రయించిందని ఆరోపించారు. జనాభాలో సగం ఉన్న బీసీలకు గత ప్రభుత్వం అన్యాయం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం బీసీలకు అండగా నిలుస్తున్న విషయాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలని నేతలకు సూచించారు.

**సమన్వయంతో ముందుకు సాగాలి :** కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. వివిధ స్థాయిల్లోని సమన్వయ కమిటీలను క్రియాశీలం చేయాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో ఉన్న సమన్వయం క్షేత్రస్థాయిలోనూ కనిపించాలన్నారు. భాగస్వామ్య పార్టీల నేతలు కలిసి ప్రచారం నిర్వహిస్తూ, పరస్పర సహకారంతో ఎన్నికల్లో ముందుకు సాగాలని చెప్పారు.

ప్రత్యర్థి పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని చంద్రబాబు సూచించారు. వైకాపా అధినేత జగన్ అక్రమంగా ఆస్తులు సంపాదించుకున్నారని ఆరోపిస్తూ, తమపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. జగన్ పాలనలో పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, వ్యాపారవేత్తలు జైళ్లకు వెళ్లారని విమర్శించారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా అభివృద్ధి నిరోధక శక్తులకు గట్టి సమాధానం చెప్పాలని చంద్రబాబు నేతలకు పిలుపునిచ్చారు. ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరించి, కూటమి విజయానికి కృషి చేయాలని స్పష్టం చేశారు.

## చెన్నై మెట్రోకు పచ్చజెండా



(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాజెక్టులో అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. ముఖ్యంగా, కొన్నిచోట్ల డబుల్ డెక్కర్ సెక్షన్‌ను నిర్మించడం ఈ మార్గం ప్రత్యేకత. అంతేకాకుండా భవిష్యత్తులో డ్రైవర్ అవసరం లేకుండానే రైళ్లను నడిపేందుకు వీలుగా ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇది రైళ్ల రాకపోకలలో కచ్చితత్వాన్ని, భద్రతను పెంచుతుంది.

ఈ కొత్త మెట్రో కారిడార్ అందుబాటులోకి రావడంతో చెన్నై పశ్చిమ శివారు ప్రాంతాలైన పూనమల్లి వంటి ఏరియాల నుంచి వడపళని వంటి నగర కేంద్ర ప్రాంతాలకు ప్రయాణం సులభతరం కానుంది. రోజూ ప్రయాణించే వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసిన వెంటనే ఈ మార్గంలో ప్రయాణికుల కోసం సాధారణ సర్వీసులను కూడా ప్రారంభించారు. తమిళనాడు పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ఈ కొత్త మెట్రో లైన్ చెన్నై నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

## రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

బీసీల జనాభా వివరాల కోసం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, గ్రామ, వార్డు సచివాలయాల సమాచారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. బీసీ రిజర్వేషన్ల అమలుకు సుప్రీంకోర్టు నిర్దేశించిన ట్రిపుల్ టెస్ట్ నిబంధనలను పాటించాల్సి ఉందని ఉత్తర్వుల్లో వివరించారు. బీసీల రాజకీయ వెనుకబాటుతనాన్ని అంచనా వేసేందుకు రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

**గత ఉత్తర్వులపై న్యాయపరమైన చిక్కులు :** 1994 ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ల చట్టంలోని సెక్షన్లు 6, 14(ఎ), 1965 ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టంలోని సెక్షన్లు 8, 24 ప్రకారం.. బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆగస్టు 19న ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. వాటిని సవాలు చేస్తూ న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు దాఖలయ్యాయని పేర్కొంది. ఈ వ్యవహారాన్ని పరిశీలించిన సుప్రీంకోర్టు రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని తీర్పునిచ్చిన నేపథ్యంలో తాజా ఉత్తర్వులు విడుదల చేసినట్లు వివరించింది.

**రెండో ఎన్నిక నుంచి రొటేషన్ :** పట్టణ స్థానిక సంస్థల్లో 2021లో జరిగిన తొలి సాధారణ ఎన్నికల సమయంలో రిజర్వేషన్ల రొటేషన్ ప్రక్రియ ప్రారంభమైందని ప్రభుత్వం తెలిపింది. రెండో సాధారణ ఎన్నికల నుంచి ఛైర్‌పర్సన్లు, మేయర్లు, వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లు భ్రమణ పద్ధతిలో కొనసాగుతాయని పేర్కొంది. భవిష్యత్తులో వార్డుల పునర్విభజన చేపట్టినప్పుడు వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్ల రొటేషన్ మళ్లీ ప్రారంభమవుతుందని వివరించింది.

తాజా ఉత్తర్వుల ప్రకారం మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టాలని పట్టణాభివృద్ధిశాఖ డైరెక్టరును ప్రభుత్వం ఆదేశించింది.

## జిబౌటీ తీరంలో మృత్యుఘోష

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఘటన జిబౌటీ తూర్పుతీరంలోని గల్ఫ్ ఆఫ్ ఏడెన్ , బాబ్ అల్-మండేబ్ జలసంధికి ఎదురుగా ఉన్న గుహెరే సమీపంలో జరిగిందని తెలిపింది. 300మందికి పైగా ప్రయాణికులతో పడవ జిబౌటీ నుండి యెమెన్‌కు వెళుతోందని అన్నారు. ప్రమాదంలో 80మందికి పైగా ప్రాణాలతో బయటపడ్డారని, వీరంతా ఇథియోపియన్లని అధికారులు తెలిపారు. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు చేపడుతున్నారని అన్నారు. సెప్టెంబర్ 10 నుండి ఇథియోపియా నుండి జిబౌటీకి 20,000 కంటే ఎక్కువ రాకపోకలు నమోదైనట్లు అంతర్జాతీయ వలసల సంస్థ తెలిపింది. గతేడాది, ఐదు లక్షల కంటే ఎక్కువ మంది ఈ మార్గం గుండా యెమెన్‌లోకి వెళ్లడానికి ప్రయత్నించారని, మరియు కనీసం 900 మంది మరణించారని లేదా గల్లంతయ్యారని ఆ సంస్థ పేర్కొంది.

# పేదలకు శాశ్వత హక్కులు



**నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదలకు అండగా నిలుస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా సర్వేపల్లి కట్ట ప్రాంతంలో నివసిస్తున్న 939 పేద కుటుంబాలకు రూ.600 కోట్ల విలువైన స్థలంపై శాశ్వత హక్కులు కల్పిస్తూ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొని లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. కూటమి ప్రభుత్వం తమ సొంతింటి కలను సాకారం చేసిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

**సంక్రాంతికి మరో 4 వేల మందికి.. :** సుపరిపాలనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పేదలకు శాశ్వత ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని సీఎం తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ, మంగళగిరిలో ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తయిందన్నారు. వచ్చే సంక్రాంతి నాటికి నెల్లూరులో మరో 4 వేల మందికి పట్టాలు అందజేస్తామని వెల్లడించారు. జాఫర్ సాహెబ్ కెనాల్ ప్రాంతంలో నివసిస్తున్న పేదలకు కూడా త్వరలో పట్టాలు ఇస్తామని మంత్రి నారాయణ తెలిపారు. అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు.

బుర్రిపాలెం నుంచి మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, ఇప్పటికే 5.50 లక్షల ఇళ్లను అందించామని చంద్రబాబు గుర్తుచేశారు. ఇళ్ల స్థలాలతోపాటు రహదారులు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు, ఇంటర్నెట్ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. పట్టణాలు, గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.1.80 లక్షల కోట్లు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు.

గత ప్రభుత్వ హయాంలో డబ్బులు ఇస్తేనే పట్టాలు ఇచ్చేవారని విమర్శించారు. తమ ప్రభుత్వం పేదలకు పట్టుచీర, పసుపు కుంకుమలతో గౌరవప్రదంగా పట్టాలు అందజేస్తోందన్నారు.

**సంక్షేమంలో రాజీ లేదు :** సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా రాజీ పడబోమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సామాజిక పింఛన్ల కోసం ప్రతి నెలా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ 'తల్లికి వందనం' పథకం వర్తింపజేస్తామని తెలిపారు. 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలు ఇప్పటికే 100 కోట్ల ప్రయాణాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. 'దీపం-2' పథకం కింద గ్యాస్ సబ్సిడీని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. విద్యుత్తు ఛార్జీలను ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు. ప్రతి ఇంటిపై సౌర విద్యుత్తు ఉత్పత్తి వ్యవస్థ ఏర్పాటును ప్రోత్సహిస్తున్నామని, ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' కార్యక్రమాన్ని అమలు చేస్తామని వివరించారు. అన్నదాత సుఖీభవ, నేతన్న, మత్స్యకార, ఆటో డ్రైవర్ సేవలో వంటి పథకాలతో వివిధ వర్గాలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు.

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం :** గత ప్రభుత్వం భూముల రీసర్వే పేరుతో పట్టాదారు పాస్‌పుస్తకాలు, సరిహద్దు రాళ్లపై అప్పటి పాలకుల చిత్రాలను ముద్రించిందని చంద్రబాబు విమర్శించారు. వాటిని తొలగించి, రాజముద్రతో భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా పాస్‌పుస్తకాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రజలకు నష్టం కలిగించే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని తెలిపారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్లను ఆదేశించామన్నారు. ఇటీవల ప్రకాశం జిల్లాలో గర్భకండ్రిక భూముల సమస్యను పరిష్కరించిన విషయాన్ని గుర్తుచేశారు. గీత కార్మికులకు ఎక్సైజ్ దుకాణాలు, వడ్డెరలకు మైనింగ్ లీజులు ఇచ్చామని వివరించారు.

**స్థానిక ఎన్నికల తర్వాత ట్రిపుల్ ఇంజిన్ సర్కారు :** గ్రామాల నుంచి పట్టణాలకు వలస వచ్చే ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని సీఎం తెలిపారు. పట్టణాలను వృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన లక్ష్యంగా పీ4 విధానాన్ని తీసుకొచ్చామని, ఆర్థిక అసమానతలను తగ్గించడమే తన సంకల్పమని పేర్కొన్నారు.

ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఉందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ట్రిపుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో మేయర్లు, ఛైర్మన్లను నేరుగా ఎన్నుకునే విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. నీతి, నిజాయతీ ఉన్న నాయకులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గత ఎన్నికల్లో ప్రజలు వేసిన ఓటుతో రాష్ట్రంలో మార్పు వచ్చిందని, నాలుగోసారి ముఖ్యమంత్రిగా రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. పట్టాలు అందుకున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# దసరా.. జనరంజకంగా జరగాలి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ దుర్గగుడిలో ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలను గ్రాండ్ సక్సెస్ చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. దేవాదాయ శాఖ, పర్యాటక శాఖ, జిల్లా యంత్రాంగం కలిసి పనిచేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు, పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు తరలివస్తున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. వీఐపీల రాక కారణంగా సామాన్య భక్తులు ఇబ్బంది పడకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దసరా సామాన్యుల దసరాగా ఉండాలి....వీఐపీ దసరాగా కాదు...అన్ని వర్గాలు దీనికి సహకరించాలి. ఉన్నత స్థాయిలో అధికారులు తీసుకునే నిర్ణయాలకు అంతా సహకరించాలని సీఎం సూచించారు. దర్శనాలు, సౌకర్యాలకు సంబంధించి తీసుకుంటున్న నిర్ణయాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని సీఎం అన్నారు. వీఐపీల రాక కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తే...ఆ సమయంలో ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు తగ్గించే వ్యూహాలను అమలు చేయాలని సీఎం సూచించారు. మరోవైపు టూరిజం శాఖ కూడా విజయవాడ ఉత్సవ్ 2.0ను విజయవంతం చేయాలని చెప్పారు. మన సంస్కృతీ, సాంప్రదాయాలు చాటేలా నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ ను ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలన్నారు. దసరా సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొనేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు, పర్యాటకులు, ప్రజలతో ఈ ప్రాంతంలో ఎకనమిక్ యాక్టివిటీ పెరుగుతుందని సిఎం అన్నారు. దానికి అనుగుణంగా ఏర్పాట్లు జరగాలన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దుర్గమ్మ దర్శనానికి, సరస్ మేళాకు హాజరవుతున్న నేపథ్యంలో ఆమె పర్యటనపైనా చర్చించారు. దేశవ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల ఉత్పత్తులు ప్రదర్శించేలా 'జాతీయ సరస్ మేళా-2026'ను విజయవాడలోని పున్నమి ఘాట్‌లో అక్టోబర్ 13 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చే మహిళా పారిశ్రామికవేత్తల కోసం 576 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మన రాష్ట్రం నుంచి 208 స్టాళ్లు మేళాలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీ ఎస్‌హెచ్‌జి మహిళలు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు 'స్వయం ఏపీ' బ్రాండ్ కింద తమ ఉత్పత్తులను జాతీయ స్థాయిలో ప్రదర్శించి, విక్రయించేందుకు ఈ మేళా వేదిక కావాలని సిఎం అన్నారు. సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ సమీక్షలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్ తో పాటు ఆయా శాఖ అధికారులు, ఎన్టీఆర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యాటక పటంలో ఏపీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మూడు రోజుల స్పెయిన్ పర్యటన విజయవంతంగా ముగిసింది. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పునరుద్ధరించడానికి, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడానికి, నూతన సాంకేతికతలను ప్రవేశపెట్టడానికి మంత్రి దుర్గేష్ ఈ పర్యటనలో చేసిన కృషి విశేష ప్రశంసలు పొందింది. స్పెయిన్‌లోని సెవిల్లె నగరంలో జరిగిన ప్రతిష్టాత్మక 'టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్-2026' లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని చేసిన ప్రసంగం, ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది.. గ్లోబల్ టూరిజం ట్రెండ్స్, స్మార్ట్ డెస్టినేషన్స్, సుస్థిర పర్యాటక విధానాలపై పర్యాటక నిపుణులతో మంత్రి దుర్గేష్ సుదీర్ఘంగా చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా రూపుదిద్దుకున్న వినూత్న మోడల్ 'చీఅఎఖ ూ×' ను మంత్రి దుర్గేష్ ప్రపంచ వేదికపై ఆవిష్కరించారు. 'జుఇజూశ్రీబతీస్త్రవతీ' సంస్థ సహకారంతో ఏపీలోని 100కు పైగా ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలలో పర్యాటకులకు తమ సొంత భాషలోనే సమాచారం అందించేలా ఈ సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా స్పెయిన్‌కు చెందిన పలు అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పర్యాటక సంస్థలతో మంత్రి దుర్గేష్ నేరుగా సమావేశమయ్యారు. సుదీర్ఘ తీరప్రాంతంలో వెల్ నెస్ సెంటర్లు, టెంపుల్ టూరిజం, ఎకో-టూరిజం, రిసార్టుల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అపార అవకాశాలను వివరించి పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. సమ్మిట్‌లో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. లి"మీరు ఇప్పటికే భారతదేశాన్ని చూశామని భావిస్తే.. ఒక్కసారి ఆంధ్రప్రదేశ్ వచ్చి చూడండి, మేము మిమ్మల్ని ఖచ్చితంగా ఆశ్చర్యపరుస్తాం"లి అని పిలుపునివ్వడం గ్లోబల్ డెలిగేట్లను విశేషంగా ఆకట్టుకుంది. పర్యటన అనంతరం విజయవాడ చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్ స్పెయిన్ పర్యటన ద్వారా లభించిన అనుభవాలు, ఆధునిక సాంకేతికత, అంతర్జాతీయ పెట్టుబడుల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు వేగవంతమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.. మీ సందర్భంగా స్పెయిన్ లో తనకు లభించిన ఆతిథ్యం పట్ల మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు.

## సరస్ మేళా.. మహిళా శక్తికి జాతర

(మొదటి పేజీ తరువాయి)

576 స్టాళ్లు ఏర్పాటు చేశామని.. రాష్ట్రం నుంచి అత్యధికంగా 208 స్టాళ్లు ఉండగా, రాజస్థాన్ (24), మధ్యప్రదేశ్ (23), ఉత్తరప్రదేశ్ (22), మహారాష్ట్ర (21), పశ్చిమ బెంగాల్ (19), కేరళ (17), పంజాబ్ (17) రకరకాల స్టాల్స్ ఈ మేళాలో కొలువు దీరుతున్నాయని కొండపల్లి స్పష్టం చేశారు.

ఏపీ ఎస్‌హెచ్‌జి మహిళలు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు 'స్వయం ఏపీ' బ్రాండ్ కింద తమ ఉత్పత్తులను జాతీయ స్థాయిలో ప్రదర్శించి, విక్రయించేందుకు ఇది సువర్ణావకాశం అని... చంద్రబాబు గారి నాయకత్వంలో రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దే లక్ష్యంతో సెర్ప్, మెప్మా సంస్థలు అంకితభావంతో పనిచేస్తున్నాయని మంత్రి కొనియాడారు.

నవరాత్రి ఉత్సవాలతో పాటు సరస్ మేళా శోభ :

ప్రసిద్ధ బెజవాడ కనకదుర్గ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్‌తో పాటు జాతీయ సరస్ ఆజీవిక మేళా ఒకే సమయంలో జరగడం భక్తులకు, ప్రజలకు గొప్ప అవకాశమని మంత్రి తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చేవారు ఈ మేళాను సందర్శించి దేశవ్యాప్త రుచులు, వస్తువులను ఆస్వాదించవచ్చని పిలుపునిచ్చారు. ఈ మేళాలో చేనేత ఉత్పత్తులు ఉప్పాడ, వెంకటగిరి, పట్టు చీరలు, కలంకారి వస్త్రాలు, ఖాదీ దుస్తులు మరియు గృహ అలంకరణ వస్తువులతో పాటు చేతిపనుల వస్తువులైన చెక్క శిల్పాలు, టెర్రకోట పాత్రలు, జూట్ బ్యాగులు, ప్రకృతి సిద్ధమైన సబ్బులు, హెర్బల్ ఉత్పత్తులు కూడా ప్రదర్శనలో ఉంచుతారని తెలిపారు.

అలాగే చిరుధాన్యాలు (మిల్లెట్స్), సంప్రదాయ స్వీట్లు, కోల్డ్ ప్రెస్డ్ నూనెలు, నాణ్యమైన ఊరగాయలు, తేనె మరియు అటవీ సహజ ఉత్పత్తులతో పాటు వివిధ రాష్ట్రాల ప్రసిద్ధ లైవ్ ఫుడ్ స్టాళ్లు కూడా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. మేళాకు వచ్చే సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విశాలమైన పార్కింగ్, తాగునీరు, భద్రత మరియు వైద్య శిబిరాలు వంటి అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నామని... విజయవాడ చుట్టుపక్కల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామీణ మహిళా శక్తిని ప్రోత్సహించాలని మంత్రి కొండపల్లి విజ్ఞప్తి చేశారు.

## మీ రాకతో మా గ్రామానికి పండుగ వచ్చింది



- మీరు ఆరోగ్యంగా ఉంటే రాష్ట్రం క్షేమంగా ఉంటుంది
- బాట బాగాలేనప్పుడు మా ఊరికి ఆటోలు, అంబులెన్సులు లేవు
- మీ రాక మా గ్రామాల అభివృద్ధికి అతిపెద్ద ముందడుగు
- మాటా మంతి కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రితో గిరిజన గ్రామాల ప్రజలు
- సమస్యలు వివరించిన వెంటనే పరిష్కరించేందుకు పవన్ కళ్యాణ్ భరోసా

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 'మీరు రాక ముందు అడవి మధ్యన ఉండే మా బతుకుల్లో వెలుగులు లేవు.. మీరు రాక ముందు మా గ్రామాలకు రోడ్లు లేవు.. అంబులెన్సులు, ఆటోలు లేవు.. మీ రాకతో మా గ్రామాలకు పండుగ వచ్చింది. మీరు ఆరోగ్యంగా ఉంటే రాష్ట్రం క్షేమంగా ఉంటుంది. ముఖ్యంగా మా గిరిజన గ్రామాలు మరింత క్షేమంగా ఉంటాయి' అంటూ రాకోట గ్రామంలో జరిగిన మన ఊరు మాటా మంతి కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు తమ సమస్యలు చెప్పుకొన్నారు. ఉప ముఖ్యమంత్రి రాక తమ గ్రామాల అభివృద్ధికి అతిపెద్ద ముందడుగని అభిప్రాయపడ్డారు.

పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించక ముందు రోడ్లు లేక చాలా ఇబ్బందులు పడ్డాం. మీరు మా సమస్యలు గుర్తించి పరిష్కరించారు. మీరు మా రియల్ లైఫ్ హీరో సర్. మీ రాక మాకు జీవితాంతం గుర్తుంటుంది.

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మా గ్రామానికి రావడం మా అదృష్టం. మా గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు పాడయ్యింది. చీమగండి, కాకవాడ గ్రామాల మధ్య రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వేములకొండ గ్రామానికి చెందిన కృష్ణవేణి అనే మహిళ కోరారు. తక్షణం స్పందించిన పవన్ కళ్యాణ్ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

350 మంది జనాభా కలిగిన రాకోట గ్రామం వేములకొండ గ్రామ పంచాయతీ పరిధిలో ఉంది. మా గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా గుర్తించి, భారతదేశ చిత్రపటంలో మాకంటూ ఓ చోటు కల్పించండి. ఈ అంశంపై సాధ్యాసాధ్యాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. అడవితల్లిబాట కార్యక్రమం ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంలో ఉప ముఖ్యమంత్రి చిన్న కుమారుడు అగ్నిప్రమాదానికి గురైనా, ప్రజల సమస్యకే ప్రాధాన్యతనిచ్చి కార్యక్రమాలు పూర్తి చేసి వెళ్లిన పవన్ కళ్యాణ్ పాలనా దక్షతకు గిరిపుత్రులు ధన్యవాదాలు తెలిపారు. రాకోట గ్రామ పెద్ద సోమిరెడ్డి తమ గ్రామ సమస్యలను పవన్ కళ్యాణ్‌కు వివరించారు. పాము కాటు విషం అందుబాటులో ఉంచాలని కోరగా, యాంటీ స్నేక్ వెనం డోసులు అప్పటికే అందుబాటులో ఉంచినట్టు ఉప ముఖ్యమంత్రి తెలియజేశారు. మాటా మంతి కార్యక్రమానికి వచ్చే ముందు రాకోట గ్రామం మొత్తం పవన్ కళ్యాణ్ కలియదిరిగారు. గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లు పరిశీలించి, షోల్డర్స్ తక్కువ ఎత్తులో ఉండటాన్ని గమనించి సరిచేయాలని అధికారులకు ఆదేశించారు. చెదలవాడ విజయలక్ష్మి అనే మహిళను పలకరించి గ్రామస్తుల వృత్తి, వివరాలపై ఆరా తీశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు వేయలేదని చెప్పగా, వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉండే విత్తనాలు అందించే ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. మాటా మంతి కార్యక్రమం అనంతరం గ్రామంలోని 40 మంది యువకులకు వాలీబాల్, క్రికెట్ కిట్లు అందజేశారు.

# గిరిజన బాటకు.. రూ.2,052 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

కోసం తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి ఎన్నో త్యాగాలు చేశారు. నారా చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో కూడా మన వాళ్ళు, వీరమహిళలు తమ సంఘీభావాన్ని చాటారు. కష్టకాలంలో అండగా నిలిచిన వారి త్యాగాలను మనం ఎప్పటికీ మర్చిపోకూడదు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తు ధర్మాన్ని గౌరవిస్తూ మన పార్టీ నాయకులకు, వీరమహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి. వారి త్యాగాలకు తగిన గౌరవం లభించాలి. పదవులు ఆశించకుండా అండగా నిలిచిన వారి నమ్మకాన్ని మనం నిలబెట్టుకోవాలి.

**అడవితల్లి బాట లక్ష్యం అదే :** గిరిజన గ్రామాలకు రహదారి సదుపాయాలు కల్పించి, వాటిని అభివృద్ధి పథంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 'అడవితల్లి బాట' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. రహదారుల నిర్మాణం ద్వారా గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, రవాణా, మార్కెట్ సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నాం. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పీఎం-జన్మన్, పీఎంజీఎస్‌వై-4, ఉపాధి హామీ పథకాల సమన్వయంతో 'అడవితల్లి బాట' కార్యక్రమాన్ని ప్రారంభించాం. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, పోలవరం, శ్రీకాకుళం, విజయనగరం, నంద్యాల, ఏలూరు జిల్లాల్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఈ కార్యక్రమం కింద 858 గిరిజన ఆవాసాలకు 1,662 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి రూ.1,406 కోట్లతో పనులు చేపట్టాం. ఇదే స్ఫూర్తితో అడవితల్లి బాట 2.0 ద్వారా మరో 1,341 ఆవాసాలకు 1,976 కిలోమీటర్ల మేర రహదారులు, 45 వంతెనల నిర్మాణం కోసం రూ.2,052 కోట్లతో మొత్తం 2,569 పనులను మంజూరు చేశాం.

2018లో చేపట్టిన పోరాట యాత్ర సందర్భంగా ఉత్తరాంధ్ర ఏజెన్సీ ప్రాంతాల్లోని అనేక గిరిజన గ్రామాలను సందర్శించి, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నాను. రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల గిరిజన ప్రాంతాలు అభివృద్ధికి ఎంత దూరంగా ఉన్నాయో అర్థం చేసుకున్నాను. అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన గ్రామాలకు రహదారి సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాం. అయితే, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం సాధారణ గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే ఎంతో క్లిష్టమైన ప్రక్రియ. కొండల మధ్య కిలోమీటర్ల మేర మార్గాలను ఏర్పాటు చేయడంతోపాటు, భారీ బండరాళ్లను తొలగించాలి. అవసరమైన చోట రాక్ కట్టింగ్, కంట్రోల్ బ్లాస్టింగ్ చేపట్టాలి. కొండ వాలులను స్థిరపరిచి, రహదారికి పటిష్ఠమైన పునాది వేసిన తర్వాత గ్రావెల్, ఇతర పొరలను ఏర్పాటు చేసి బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉంటుంది.

**83 వేల మంది రైతులకు లబ్ధి :** గిరిజన కుటుంబాలకు స్థిరమైన ఆదాయాన్ని కల్పించి, వారి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఉద్యానవనాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉపాధి హామీ, వీబీ-జీ రామ్ జీ పథకాల ద్వారా గిరిజన ప్రాంతాల్లో 85 వేల ఎకరాల్లో ఉద్యానవనాలను అభివృద్ధి చేసి, సుమారు 83 వేల మంది రైతులకు లబ్ధి చేకూర్చాం. ఏజెన్సీ ప్రాంతాల్లో కాఫీ సాగును ప్రోత్సహించడంతో పాటు,



కాఫీ తోటలకు నీడనిచ్చే సిల్వర్ ఓక్ వంటి మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం. అలాగే, గిరిజన ప్రాంతాల్లో పర్యాటకాన్ని అభివృద్ధి చేయడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాం. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు సుంకరమెట్ట కాఫీ తోటల్లో వుడెన్ బ్రిడ్జి, కానోపీ వాక్‌లను నిర్మించాం. మారేడుమిల్లిలో 11 హెక్టార్ల విస్తీర్ణంలో అరోమా కానోపీ వాక్, ట్రెక్కింగ్ వంటి కార్యకలాపాల ద్వారా పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్నాం. నల్లమలలో జంగిల్ సఫారీని అభివృద్ధి చేయడం ద్వారా చెంచు గిరిజన కుటుంబాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

మైదాన ప్రాంతాల్లో నివసించే బంజారా, యానాది, యెరుకుల గిరిజన ఆవాసాలకు కూడా రహదారి సౌకర్యం కల్పిస్తున్నాం. పల్లెపండుగ కార్యక్రమం కింద ఇప్పటికే 167 ఆవాసాలకు 111 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించాం. పల్లెపండుగ 3.0 ద్వారా మరో 84 ఆవాసాలకు 63.4 కిలోమీటర్ల రహదారుల నిర్మాణ పనులు చేపట్టాం. అలాగే, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో సీఎస్ఆర్ నిధులతో 25 అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నాం. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు, నంద్యాల జిల్లాల్లో జల్ జీవన్ మిషన్ కింద రూ.406 కోట్లతో 3,776 సింగిల్ విలేజ్ స్కీమ్ పనులు కొనసాగుతున్నాయి. మొత్తంగా పల్లెపండుగ కార్యక్రమం ద్వారా సుమారు రూ.7,481 కోట్లతో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

**రహదారులు, మొబైల్ కనెక్టివిటీకి అనుమతులు :** గిరిజన ప్రాంతాల్లో రహదారులు, మొబైల్ కనెక్టివిటీ, పర్యాటక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి, గిరిజన కుటుంబాల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా అటవీ శాఖ నుంచి 555 రహదారి పనులు, 136 సెల్ టవర్ల ఏర్పాటు, 48 ప్రాంతాల్లో ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ నిర్మాణానికి ఇప్పటికే అనుమతులు మంజూరు చేశాం. మిగిలిన అటవీ అనుమతులు కూడా త్వరితగతిన లభించేలా చర్యలు తీసుకుంటున్నాం. అరకులోని డుంబ్రిగుడ, కురిడి గ్రామాలను సందర్శించినప్పుడు సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్న వారితో పాటు, తీవ్రమైన రక్తహీనత సమస్యను ఎదుర్కొంటున్న గిరిజన గర్భిణుల ఇబ్బందులను గుర్తించాం. అత్యవసర సమయాల్లో వారికి సకాలంలో రక్తం అందించాలనే లక్ష్యంతో అరకు ఏరియా ఆసుపత్రిలో సుమారు రూ.కోటి సీఎస్ఆర్ నిధులతో ప్రత్యేక బ్లడ్ బ్యాంకును నిర్మిస్తున్నాం.

వ్యవసాయ ఉత్పాదకతను పెంచి, రైతులకు ఆధునిక వ్యవసాయ పనిముట్లను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రధానమంత్రి కృషి సించాయి యోజన 2.0 వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కంపోనెంట్ కింద రూ.68 కోట్లతో చేపట్టిన కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభిస్తున్నాం.

రాష్ట్రంలోని 59 వాటర్‌షెడ్ ప్రాజెక్టుల పరిధిలో 34 వేల మందికి పైగా అర్హులైన రైతులకు 38 రకాల, 3 లక్షలకు పైగా వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేయనున్నాం. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లను అందిస్తున్నాం.

**స్థానిక సమస్యల పరిష్కారానికి ఆదేశాలు :** వేములకొండ, రాకోట, సువర్లవాడ, దారగూడెం, దబ్బబయలస, తిరుగతిరళ్ళు, కాకవాడ, చకలవీధి, వెట్టిచెలకలు, సోకులగూడెం గ్రామాల ప్రజలతో నిర్వహించిన మాటామంతీ కార్యక్రమంలో స్థానికులు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన సమస్యలు, అవసరాలను నా దృష్టికి తీసుకువచ్చారు. వాటన్నింటినీ మంజూరు చేస్తూ, సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపట్టి, పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని ఆదేశిస్తున్నాను. గిరిజనుల హక్కులను గౌరవిస్తూ, వారి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ, అడవులను కాపాడే వారి జీవితాల్లో వెలుగులు నింపి, అభివృద్ధి ఫలాలను ప్రతి గిరిజన ఆవాసానికి చేర్చడమే కూటమి ప్రభుత్వ సంకల్పం.

**పార్టీ రంగులు వేసుకోవడానికి కోట్లు ఖర్చు చేశారు :** 2019-2024 మధ్య రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎంత నిర్లక్ష్యానికి గురయ్యాయో మనందరికీ తెలుసు. మన కళ్లముందే గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. ముఖ్యంగా గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాలు కల్పించడంలో గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. ప్రజల అవసరాల కోసం ఖర్చు చేయాల్సిన నిధులను శిలాఫలకాల ఏర్పాటు కోసం, ప్రభుత్వ కార్యాలయాలకు పార్టీ రంగులు వేయడం కోసం, కోర్టుల ఆదేశాల తర్వాత ఆ రంగులను తొలగించి మళ్లీ కొత్త రంగులు వేయడం కోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అదే నిధులను సద్వినియోగం చేసి ఉంటే ఎన్నో గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించవచ్చు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచవచ్చు.

మనం నిర్మిస్తున్న రహదారులు నాణ్యతతో ఉన్నాయా లేదా అని పరిశీలించాల్సిన బాధ్యత కూడా స్థానిక ప్రజలపై ఉంది. కేవలం రోడ్లు వేయించడమే కాదు, అవి నాణ్యతతో నిర్మితమై, ఎక్కువకాలం ప్రజలకు ఉపయోగపడేలా చూడాలి. ఎక్కడైనా నాణ్యతలో లోపాలు కనిపిస్తే వాటిని మా దృష్టికి తీసుకురండి. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో మీరు సంపూర్ణ సహకారం అందిస్తే, మరింత బాధ్యతతో, మరింత ధైర్యంతో ముందుకు సాగగలం. ప్రతిపక్ష మద్దతుదారులకు ఒకటే చెబుతున్నాం. మేము అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా చూస్తున్నాం. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత, ప్రతిపక్ష మద్దతు ఉన్న పంచాయతీలకు కూడా అవసరమైన నిధులు అందేలా చర్యలు తీసుకున్నాను. ఎందుకంటే నాకు ముఖ్యమైన విషయం - ఏ పార్టీ బతకాలి అనేది కాదు వ్యవస్థ బతకాలి, గ్రామాలు బాగుపడాలి, ప్రజల జీవితాలు మెరుగుపడాలి. వ్యవస్థ బలంగా ఉంటేనే గ్రామాలకు రహదారులు వస్తాయి. యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రజలకు జీవనోపాధి మెరుగుపడుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. అందుకే రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్నదే మా లక్ష్యం. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎక్కడికక్కడ లంచాలు తీసుకుంటూ, ఆధిపత్య అహంకారంతో ప్రజలను భయపెట్టే పరిస్థితులు ఉండకూడదు. తప్పును ప్రశ్నించే ధైర్యం ప్రజలకు ఉండాలి. అదే సమయంలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను కూడా గుర్తించాలి. ధైర్యంగా ఉండాలి, బాధ్యతగా వ్యవహరించాలి, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి" అన్నారు.

## జగన్మాత ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి



**ఇంద్రకీలాద్రి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆకాంక్షించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత శ్రీ కనకదుర్గమ్మను హోంమంత్రి వంగలపూడి అనితతో కలిసి ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. వీరికి ఆలయ చైర్మన్ ఈవో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేశారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా చైర్మన్ ఈఓ అమ్మవారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు పెద్దసంఖ్యలో తరలివస్తున్న భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో చేపట్టిన ఏర్పాట్లు బాగున్నాయని మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రశంసించారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టడం అభినందనీయమన్నారు.

## మాజీ సైనికుల అనుభవాలు దేశాభివృద్ధికి దోహదపడాలి



**నరసన్నపేట (జర్నలిస్ట్ ఫైల్) :** దేశ సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి రక్షణ బాధ్యతలు నిర్వర్తించిన మాజీ సైనికులు, పదవీ విరమణ అనంతరం తమ అనుభవాలను సమాజ అభ్యున్నతికి వినియోగించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. సైనికుల దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం యువతకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. నరసన్నపేటలోని ఎన్ఏఆర్ హాల్‌లో త్రివిధ దళాల విశ్రాంత సైనికుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నరసన్నపేట సమన్వయకర్త పోకతోట సింహాచలం ఆధ్వర్యంలో, శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు సత్యవరం కూడలి నుంచి సభా ప్రాంగణం వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. ఎండ, వాన, చలి వంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ సరిహద్దుల్లో సైనికులు అందించే సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. వారి త్యాగాల వల్లే దేశ ప్రజలు ప్రశాంతంగా జీవించగలుగుతున్నారని అన్నారు. దేశం కోసం సేవలందించిన మాజీ సైనికులకు సమాజంలో సముచిత గౌరవం కల్పించాలని, సైనిక జీవితంలో అలవర్చుకున్న క్రమశిక్షణ, అంకితభావం, నాయకత్వ లక్షణాలను సామాజిక సేవలోనూ ప్రదర్శించాలని సూచించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మాజీ సైనికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని నాయకులు తెలిపారు. ఒకే ర్యాంకు-ఒకే పింఛను విధానం, మాజీ సైనికులు, వారి కుటుంబాలకు వైద్య సేవలు, పునరావాసం, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలను ప్రస్తావించారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోకతోట సింహాచలం మాట్లాడుతూ.. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్య సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రత పరిరక్షణలో మాజీ సైనికుల అనుభవాలు సమాజానికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మాజీ సైనికులు ఎదుర్కొంటున్న పింఛను, వైద్యం, పునరావాసం, ఉపాధి సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయా సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

దేశ నిర్మాణం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని నాయకులు పేర్కొన్నారు. మాజీ సైనికులు సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ యువతలో దేశభక్తి భావాలను పెంపొందించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, జిల్లా ఇన్‌చార్జి ఎస్వీఎస్ ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, మహిళా మోర్చా అధ్యక్షురాలు పైడి సింధూర, ప్రధాన కార్యదర్శులు చింతు పాపారావు, పెడాడ సూరపునాయుడు, మాజీ సైనికులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లెక్కలున్నా.. విషప్రచారమా?

(మొదటి పేజీ తరువాయి)

2025-26లో 79,371 మంది రైతుల నుంచి 1,61,075 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను కొనుగోలు చేయగా, అందుకు రూ.1,123.06 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. కందులు, శనగలు, మినుములు, పెసలతోపాటు ఉల్లిపాయలు, పొగాకుకు సంబంధించిన కొనుగోళ్ల వివరాలు కూడా మార్క్‌ఫెడ్ సమర్పించిన గణాంకాల్లో ఉన్నాయని చెప్పారు.

2024--25 ఖరీఫ్‌లోనే 53,640 మంది రైతుల నుంచి 79,993 మెట్రిక్ టన్నుల కందులను రూ.603.95 కోట్ల విలువకు కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. 2025-26 ఖరీఫ్‌లో 37,058 మంది రైతుల నుంచి 59,296.70 మెట్రిక్ టన్నుల కందులను రూ.474.37 కోట్ల విలువకు కొనుగోలు చేశామని తెలిపారు. అదే ఏడాది రబీలో 32,541 మంది రైతుల నుంచి 83,470.50 మెట్రిక్ టన్నుల శనగలను రూ.490.39 కోట్ల విలువకు, 7,731 మంది రైతుల నుంచి 14,518.90 మెట్రిక్ టన్నుల పెసలను రూ.127.30 కోట్ల విలువకు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఇంత స్పష్టమైన గణాంకాలు ఉన్నా రైతులకు ప్రభుత్వం ఏమీ చేయలేదన్నట్లు చిత్రీకరించడం వెనుక ఉద్దేశం ఏమిటి? రైతులకు జరిగిన మేలును గుర్తించడానికి జగన్‌కు, సాక్షికి మనసు రాదా? అని నిలదీశారు. జగన్! నీ నీచ రాజకీయాలకు రైతులను పావులుగా వాడుకోవడం మానుకోవాలని మంత్రి హెచ్చరించారు. వైసీపీ పాలన గురించి గొప్పలు చెప్పుకునే ముందు, కూటమి ప్రభుత్వం చేపట్టిన కొనుగోళ్ల లెక్కలను చూడండి. ప్రభుత్వంపై విమర్శలు చేయాలంటే వాస్తవాలతో చేయాలి. మీకు అనుకూలమైన కథనం కోసం వాస్తవాలను తొక్కిపెట్టే హక్కు ఎవరిచ్చారు? అబద్ధానికి పెద్ద శీర్షిక పెట్టినంత మాత్రాన అది నిజం కాదు. రైతుల పేరుతో ప్రభుత్వంపై బురద చల్లడం రైతు సేవ అనిపించుకోదు. జగన్, వైసీపీ నేతలు రైతు సంక్షేమంపై చర్చకు వస్తే అధికారిక గణాంకాలతోనే సమాధానం చెబుతాం అని మంత్రి స్పష్టం చేశారు.

ఖరీఫ్-2026 కొనుగోళ్ల విషయంలోనూ మార్క్‌ఫెడ్ సకాలంలో చర్యలు తీసుకుందని అచ్చెన్నాయుడు తెలిపారు. పీఎం--ఆశా ధరల మద్దతు పథకం మార్గదర్శకాలు, కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మే 20న జారీ చేసిన సూచనలకు అనుగుణంగా ఆగస్టు 17నే రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర కొనుగోలు ప్రతిపాదన సమర్పించినట్లు వివరించారు. రైతులకు నిర్దేశిత గడువులో చెల్లింపులు జరిగేలా, అంచనా ఉత్పత్తి లేదా అనుమతించే కొనుగోలు పరిమాణానికి సంబంధించిన కనీస మద్దతు ధర విలువలో కనీసం 15 శాతానికి సమానమైన రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పాటు చేసి అమల్లోకి తేవాలని కోరినట్లు తెలిపారు. కొనుగోళ్లకు సంబంధించిన అనుబంధ వ్యయాలకు కూడా నిధులు సమకూర్చాలని ప్రతిపాదించిందని చెప్పారు. కేంద్ర నోడల్ సంస్థల నుంచి నిధులు లేదా రీయింబర్స్‌మెంట్ అందేలోపు కొనుగోళ్లు నిరాటంకంగా కొనసాగేందుకు, అర్హులైన రైతులకు తక్షణమే ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసేందుకు ధరల స్థిరీకరణ నిధి లేదా వర్కింగ్ క్యాపిటల్ సహాయంగా రూ.300 కోట్లు మంజూరు చేయాలని మార్క్‌ఫెడ్ కోరినట్లు మంత్రి తెలిపారు. రైతులకు చెల్లింపుల్లో జాప్యం రాకుండా ముందస్తు నిధుల కోసం ప్రతిపాదించడం బాధ్యతాయుతమైన చర్య. రైతులకు సకాలంలో డబ్బు అందాలనే ఉద్దేశంతో తీసుకున్న చర్యలను కూడా నిర్వాకంగా చిత్రీకరించడం సాక్షి వక్రీకరణకు నిదర్శనం అని విమర్శించారు. మార్క్‌ఫెడ్ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 23 న కేంద్ర ప్రభుత్వానికి పంపి, ఖరీఫ్--2026 కొనుగోళ్లకు అనుమతి కోరినట్లు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కందులు, పెసలు, మినుములు, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న, రాగులు, కొర్రలు, వేరుశనగలను ఈ ప్రతిపాదనలో చేర్చినట్లు తెలిపారు. రైతులు తక్కువ ధరలకు పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితిని నివారించి, కనీస మద్దతు ధర ద్వారా ఆదుకోవడమే ఈ ప్రతిపాదన లక్ష్యమన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఆమోద ఉత్తర్వులు రావాల్సి ఉందని వెల్లడించారు.

ఆగస్టులో మార్క్‌ఫెడ్ ప్రతిపాదన ఇచ్చింది. సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపింది. ఇప్పుడు కేంద్ర అనుమతి రావాల్సి ఉంది. ఈ ప్రక్రియను దాచిపెట్టి రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేయలేదన్నట్లు కథనం రాయడం రైతులను తప్పుదారి పట్టించడమే. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల పంటకు మద్దతు ధర, సకాలంలో చెల్లింపుల కోసం పనిచేస్తోంది.

# ఢిల్లీలో నిరసనల హోరు

- **సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు**
- **విద్యార్థులు, యువజన సంఘాల కార్యకర్తలపై పోలీసుల దాడులు**
- **పలువురికి గాయాలు.. వందలాది మంది అరెస్టు**
- **కన్నాట్ ప్లేస్‌లో భారీగా కేంద్ర బలగాల మోహరింపు**

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం నిరసనలు హోరెత్తాయి. వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలను అడ్డుకునేందుకు పోలీసులు, కేంద్ర బలగాలు భారీగా మోహరించాయి. కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో నిరసనకారులపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని, పలువురు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారని ఆందోళనకారులు ఆరోపించారు. ఈ ఘటనల్లో అనేకమంది గాయపడ్డారు.

ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, సీజేపీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు కన్నాట్ ప్లేస్‌లో నిరసన చేపట్టారు. రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్ రెండో గేటు సమీపం నుంచి జంతర్ మంతర్ వైపు ర్యాలీగా బయలుదేరారు. పాలికా బజార్ ప్రాంతానికి చేరుకోగానే పోలీసులు, కేంద్ర బలగాలు ఆందోళనకారులను చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నాయి. నాయకులు, కార్యకర్తలను కొడుతూ పోలీసు వాహనాల్లోకి ఈడ్చుకెళ్లాయని నిరసనకారులు పేర్కొన్నారు.

ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఆదర్శ్ ఎం. సాజి, డీవైఎఫ్ఐ కేంద్ర కార్యవర్గ సభ్యుడు జైక్ సి. థామస్‌పై తీవ్రంగా దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆదర్శ్ కంటి సమీపంలో గాయమై రక్తస్రావమైంది. జైక్ సి. థామస్, డీవైఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు బాలేందర్ షాలను రోడ్డుపై ఈడ్చుకెళ్లారని ఆందోళనకారులు తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి సూరజ్ ఇళమణ్, కేంద్ర కమిటీ సభ్యుడు అభిజిత్ మణిలాల్, ఢిల్లీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సిమ్రాన్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు శరణ్య కూడా గాయపడ్డారు. ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేశ్ సీరంగరాజ్ దుస్తులను చించివేశారని ఆరోపించారు. సీజేపీ నాయకుడు సుధీర్ సాంగ్వాన్, ఎస్ఎఫ్ఐ అఖిల భారత సంయుక్త కార్యదర్శి ఐషీ ఘోష్‌ను కూడా అరెస్టు చేశారు. కన్నాట్ ప్లేస్, పరిసర ప్రాంతాల్లో ఢిల్లీ పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్), ఎస్ఎస్‌బీ, ఐటీబీపీ బలగాలను పెద్దఎత్తున మోహరించారు. రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్ గేట్ల వద్ద భద్రతా సిబ్బంది కవాతు నిర్వహించారు. అయినప్పటికీ నిరసనకారులు భద్రతా ఏర్పాట్లను దాటుకుని సీఈసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అరెస్టయిన వారిని తరలించేందుకు సాధారణ ప్రయాణికుల రవాణాకు ఉపయోగించే బస్సును పోలీసు వాహనంగా మార్చారు. వాహనాలు సరిపోకపోవడంతో ఉత్తర్‌ప్రదేశ్ నుంచి మరికొన్నింటిని రప్పించారు. పాలికా బజార్ నుంచి అరెస్టయిన వారితో బయలుదేరిన బస్సును కొంతదూరం వెళ్లాక మళ్లీ కన్నాట్ ప్లేస్‌లో నిలిపివేశారు. అనంతరం పురుష



ఆందోళనకారులను సెల్ గదులున్న మరో బస్సులోకి మార్చి, తలుపులు మూసి దాడి చేసినట్లు నిరసనకారులు ఆరోపించారు.

మహిళా సంఘం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యురాలు ఆనీ రాజాను కూడా పోలీసులు అరెస్టు చేశారు. దిశ, రివల్యూషనరీ వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా, క్రాంతికారి యువ సంఘటన్ తదితర సంస్థలు ఆందోళనల్లో పాల్గొన్నాయి. అరెస్టు చేసిన కార్యకర్తలను ఢిల్లీ సరిహద్దుల్లోని పోలీస్‌స్టేషన్లు, మైదానాలకు తరలించారు. ఆర్‌కే ఆశ్రమ్ మెట్రో స్టేషన్ సమీపం నుంచి ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ కార్యకర్తలు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మరోసారి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఏ అఖిల భారత అధ్యక్షురాలు నేహా బోరాతో పాటు పలువురిని అరెస్టు చేశారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఎస్ఎఫ్ఐ మహిళా కార్యకర్తలు జాతీయ పతాకాలతో కన్నాట్ ప్లేస్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత సంయుక్త కార్యదర్శి ఐషీ ఘోష్, ఢిల్లీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెహినా ఫాతిమా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు సఖి బంధు తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చీకటి పడ్డాక విద్యార్థినులను లైట్లు లేని వాహనాల్లో తరలించారని, ఆ సమయంలో పురుష పోలీసులు వారిపై దాడి చేశారని నిరసనకారులు ఆరోపించారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిని గెలిపించాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రులు



**ఖమ్మం అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రేణులందరూ కంకణబద్ధులై పట్టభద్రుల ఎమ్మెల్సీఎన్నికల ప్రక్రియలో భాగస్వాములై పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిరాంరెడ్డి సర్వోత్తంరెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలసన్నాహక సమావేశం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, అర్బన్ జిల్లా అధ్యక్షులు నాగండ్ల దీపక్‌చౌదరిల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ, భారతదేశ మొట్టమొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ చిత్రపటాలకు పూలమాలలువేసి అనంతరం మనం తెలంగాణ రాష్ట్రీయగీతాన్ని, జాతీయ గీతాన్ని ఆలపించి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖామంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు, ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాఘమయిదయానంద్, మాలోతు రాందాస్‌నాయక్, కోరంకనకయ్య, ఎమ్మెల్సీ అభ్యర్థి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని శ్రేణులకుదిశా, నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్రగిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్‌రాయల నాగేశ్వరరావు, హస్తకలల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్ రెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్‌బాబా, జిల్లాఆర్‌టిఏ మెంబర్ వెంకన్న, టిపిసిసి ప్రధాన కార్యదర్శి బేబీస్వర్ణ కుమారి, రాష్ట్రకిసాన్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భానోతు బాలాజీ నాయక్, రాష్ట్ర ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు బానోతు బాలాజీ నాయక్, నరసింహారావు, అంజనీ కుమార్, నాయకులు వెంకయ్య, రాధాకిషోర్, సౌజన్య, సయ్యద్‌గౌస్, బందయ్య, వీరభద్రం, శేఖర్‌గౌడ్, సయ్యద్ హుస్సేన్, అసిఫ్, విప్లవ కుమార్, యాసిన్, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన శ్రేణులందరికీ నూతి సత్యనారాయణ గౌడ్, దీపక్ చౌదరీలు దన్యవాదాలు తెలిపారు.

## మున్సిపల్ భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించండి

- బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్..



**కుత్బుల్లాపూర్, అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** బాచుపల్లి మండలం సర్వే నెంబర్ 233/1లో శంకుస్థాపన గావించి కోర్టు చిక్కులతో నిలిచిపోయిన సీఎంసీ నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ నూతన కార్యాలయ భువన నిర్మాణ స్థలాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంసీ నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయ నిర్మాణానికి గతంలో నాలుగు ఎకరాలను కేటాయించి శంకుస్థాపన చేయడం జరిగిందని, కానీ కొన్ని కోర్టు సమస్యలతో పనులను ప్రారంభం కాలేదన్నారు.రెవెన్యూ పరంగా న్యాయపరమైన చిక్కులను తొలగించి మున్సిపల్ భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ మల్లేశ్వర్ రావు, సాయి,స్థానిక మాజీ కార్పొరేటర్ ఆగం రాజు, నిజాంపేట్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యలను పరిష్కరించండి..

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం..



**అబ్దుల్లాపూర్ మెట్టు, అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** అబ్దుల్లాపూర్ మెట్టు మండలం, బండరావిరాల గ్రామంలో పలు అభివృద్ధి పనుల నిమిత్తం శనివారం గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, ఇబ్రహీం పట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించి, నూతన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు కన్నె భరత్ యాదవ్, ఏర్పుల హరిక్రిష్ణ, గుండ్ల భవానీ - శివ ముదిరాజ్, యువ నాయకులు కందికంటి మధు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు సరైన వసతులు కల్పించాలి..

- వేలాది మంది భక్తులు వచ్చే మందిరం..
- కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయుటం ప్రభుత్వం బాధ్యత..
- డిమాండ్ చేసిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత..
- ఫలక్‌నుమా ఖాళీ మాతా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసిన టీఆర్ఎస్ చీఫ్

**హైదరాబాద్, అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** ఫలక్ నుమా ఖాళీ మాతా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫలక్ నుమా ఖాళీ మాతా టెంపుల్ అంటే ఓల్డ్ సిటీలో పవర్ ఫుల్. హైదరాబాద్ ప్రజలందరికీ ఎంతో నమ్మకం.. భక్తులందరికీ కూడా కొంగు బంగారం. వేలాది మంది భక్తులు నిత్యం అమ్మవారి ఆశీర్వాదం కోసం ఇక్కడకు వస్తుంటారు.. అమ్మవారికి ముడుపు కడితే అనుకున్న కోరికలు తీరుతాయి. నేను కూడా ముడుపు కట్టాను.. అమవాస్య రోజు ఇక్కడకు ఇంకా పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు.. ఇవ్వాళ పెత్తరమాస. అదే విధంగా బతుకమ్మ పండుగ మొదలవుతుంది.. బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ శుభాకాంక్షలు.. కానీ వేలాదిగా భక్తులు వచ్చే ఖాళీ మాతా ఆలయం వద్ద భక్తులకు సరైన వసతులు లేకపోవటం బాధాకరం.. కనీసం రోడ్డు సౌకర్యం లేదు. మహిళలకు వాష్ రూమ్ లు కూడా సరిగా లేవు.. చుట్టు రైల్వే ల్యాండ్స్ ఉండటంతో పాటు పక్కనే స్మశానం ఉంది. దీంతో ఇక్కడ రోడ్డు కూడా వేసే పరిస్థితి కూడా లేదు.. స్థానిక ఎమ్మెల్యే ఇక్కడ రోడ్డు వేయించేందుకు రైల్వే నుంచి ల్యాండ్ ఇప్పించే ప్రయత్నం చేయాలి.. ఎండోమెంట్ డిపార్ట్ మెంట్, రైల్వే శాఖలను సమన్వయం చేస్తూ ఇక్కడ రోడ్డు వేయించేందుకు రైల్వే శాఖతో మాట్లాడుతాం.. అలాగే భక్తులకు కనీస వసతులు కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం.. ఇన్ని వందల మంది భక్తులు వచ్చే చోట కనీస సౌకర్యాలు కల్పించటం ప్రభుత్వం బాధ్యత.. ఫలక్ నుమా అమ్మవారి ఆలయంలో వసతులు లేవని సాయి అనే యువకుడు సోషల్ మీడియా ద్వారా మా వరకు తెచ్చాడు.. సోషల్ మీడియాను నెగిటివ్ గా వాడుతున్న ఈ కాలంలో సాయి అనే యువకుడు ఆయన టీమ్ ఇలాంటి మంచి చేస్తున్నందుకు వారిని అభినందిస్తున్నా అన్నారు..





## మానవత్వం చాటుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం..

- పేద విద్యార్థిని వైద్య విద్యకు అండగా నిలిచిన వేముల వీరేశం..
- తొలి ఏడాది ఫీజు రూ.1,20,000 అందజేత..



**నల్గొండ అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** చిట్యాల మానవత్వానికి మారుపేరుగా నిలుస్తూ, ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం నిలిచారు. చిట్యాల మున్సిపాలిటీ 7వ వార్డుకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త బూడిద శేఖర్ అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆయన కుటుంబానికి అండగా నిలిచిన వేముల వీరేశం, శేఖర్ కుమార్తె సాద్విక వైద్య విద్యకు అయ్యే ఖర్చు మొత్తం భరిస్తానని గతంలో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, సాద్విక ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఫీజు రూ.1,20,000ను ఈరోజు అందజేశారు. మిగిలిన నాలుగేళ్ల వైద్య విద్యకు సంబంధించిన ఫీజులను కూడా తానే చెల్లిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా తన కుమార్తె విన్నుత్న కూడా ఎంబీబీఎస్ చదువుతోందని పేర్కొంటూ, సాద్వికకు ఆమెను పరిచయం చేశారు. భవిష్యత్తులో ఏదైనా సహాయం అవసరమైతే తనను సంప్రదించాలని సూచించారు. సాద్విక కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వేముల వీరేశం ఆకాంక్షించారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలిచి, విద్యార్థిని వైద్య విద్యకు భరోసా కల్పించడం పట్ల పలువురు ఆయన మానవతా దృక్పథాన్ని అభినందిస్తున్నారు.

# నాగవల్లి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి కలకలం..!

- 18 కిలోల గంజాయి పట్టివేత..
- రూ.9 లక్షల విలువైన ఎండు గంజాయి స్వాధీనం
- మధ్యప్రదేశ్‌కు చెందిన 26 ఏళ్ల వ్యక్తి అరెస్ట్..
- దసరావేళ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక తనిఖీలు..



**కామారెడ్డి అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భారీగా ఎండు గంజాయి పట్టుబడింది. అక్రమంగా తరలిస్తున్న 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, మధ్యప్రదేశ్‌కు చెందిన 26 ఏళ్ల అశోక్‌ను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.ముకుంద రెడ్డి వెల్లడించారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నాగావళి ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి తరలిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాసులు నేతృత్వంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. కానిస్టేబుళ్లు అమృత్ రెడ్డి, శిరీష, రాజు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. రైల్వే సిబ్బంది సహకారంతో అనుమానాస్పదంగా కనిపించిన అశోక్‌ను తనిఖీ చేయగా అతని వద్ద 18 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. ప్రాథమిక విచారణలో ఒడిశాలోని టిట్లాగఢ్ ప్రాంతం నుంచి గంజాయిని నాగావళి ఎక్స్‌ప్రెస్ రైలులో తీసుకొచ్చి సోలాపూర్‌కు తరలిస్తున్నట్లు సమాచారం వెల్లడైందని ముకుంద రెడ్డి తెలిపారు.

**పండుగ వేళ ప్రత్యేక నిఘా..** దసరా పండుగ నేపథ్యంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగిస్తోందని ఆయన పేర్కొన్నారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**సమాచారం ఇవ్వండి.. వివరాలు గోప్యంగా ఉంచుతాం..** మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే ఎక్సైజ్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 2523కు ఫోన్ చేయాలని ముకుంద రెడ్డి కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## చట్టాన్ని పరిరక్షించిన ఢిల్లీ పోలీసులకు అభినందనలు..

- బీజేపీ సీనియర్ నేత పి.ఎల్. శ్రీనివాస్..



**కంటోన్మెంట్, అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన, విస్తృత ప్రచారం పొందిన 'జంతర్ మంతర్ 2.0' ఆందోళన.. నిరసన తెలిపే హక్కు, ప్రజా శాంతిభద్రతలను కాపాడి చట్టాన్ని పరిరక్షించిన ఢిల్లీ పోలీసులకు బీజేపీ సీనియర్ నేత పి ఎల్ శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. ప్రతిపాదిత నిరసన చుట్టూ చోటుచేసుకున్న పరిణామాలు రాజకీయంగా ఉద్రిక్తమైన వివాదంలో ఢిల్లీ పోలీసులను కేంద్రబిందువుగా నిలిపాయి.ముందస్తు సమాచారం తగినంతగా ఇవ్వకపోవడం,గతంలో జరిగిన నిరసన సందర్భంగా విధించిన షరతులను ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఉండటం, ప్రజా భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, శాంతిభద్రతలకు సంబంధించిన ఆందోళనలను కారణాలుగా చూపుతూ అక్టోబర్ 10న నిర్వహించ తలపెట్టిన సమావేశానికి అధికారులు అనుమతి నిరాకరించారని చెప్పారు.శాంతిభద్రతలను కాపాడటం పేరుతో అవసరానికి మించిన ఆంక్షలు విధించకూడదు. ప్రజా భద్రతను, శాంతియుత సమావేశ స్వేచ్ఛను ఒకేసారి పరిరక్షించాలి.రాజకీయ పార్టీలకు: ప్రతిసమీకరణలు అసలు సమస్యపై జరిగే చర్చకు ప్రత్యామ్నాయంగా మారకూడదు. రాజకీయ పోటీ ప్రజాస్వామ్యంలో సహజమే. కానీ, ప్రజా ప్రయోజనాలు రాజకీయ ఘర్షణలను రెచ్చగొట్టే ప్రయత్నాల కంటే ముఖ్యమైనవన్నారు.

# సిద్దాపూర్ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి

- కూల్చివేతలు లేకుండా రోడ్డు నిర్మించాలి..
- అక్టోబర్ 30లోగా అంచనాలు సిద్ధం చేయాలి
- అధికారులకు సూచించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి..

**సదాశివపేట అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** సదాశివపేట పట్టణంలోని సిద్దాపూర్ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మల జగ్గారెడ్డితో కలిసి ఆయన సిద్దాపూర్ రోడ్డును పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికారులతో రోడ్డు నిర్మాణం, వర్షపు నీటి పారుదల, కల్వర్టులు, డ్రైనేజీ పనులపై సమీక్ష నిర్వహించారు. మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ కాలనీ చివరి వరకు పలుమార్లు పనులు చేపట్టినా రోడ్డు సమస్య పరిష్కారం కాకపోవడంపై జగ్గారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 2004లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సిద్దాపూర్ రోడ్డు వేయించానని గుర్తుచేశారు. గత పదేళ్లలో ఈ రోడ్డు విషయంలో ఏం జరిగిందో తెలియదన్నారు. ఇకపై సిద్దాపూర్ రోడ్డు సమస్య పదేపదే చర్చకు రాకుండా పటిష్ఠంగా పనులు చేపట్టాలని సూచించారు. మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ ఈద్గా వరకు సుమారు 1.5 కిలోమీటర్ల మేర పూర్తిస్థాయిలో సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని తెలిపారు. డిగ్రీ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు జంక్షన్ వరకు సాంకేతికంగా సరైన లెవల్స్ తీసుకుని, వరద నీరు, డ్రైనేజీ నీరు సక్రమంగా వెళ్లేలా రోడ్డు నిర్మించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రారంభం నుంచి చివరి వరకు ఎక్కడా వర్షపు నీరు నిలవకుండా డ్రైన్లు, అవసరమైన చోట్ల కల్వర్టులు ఏర్పాటు చేయాలన్నారు. కల్వర్టులు అవసరమైన ప్రాంతాలను జగ్గారెడ్డి, నిర్మల స్వయంగా పరిశీలించారు. రోడ్డు వెడల్పు, అందుబాటులో ఉన్న స్థలాన్ని టేపుతో కొలిచి మరీ పరిశీలించారు.కూల్చివేతలు లేకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. 30 అడుగుల వెడల్పు ఉన్నచోట 30 అడుగులు, 40 అడుగులు ఉన్నచోట 40 అడుగులు, 60 అడుగులు అందుబాటులో ఉన్నచోట 60 అడుగుల మేర రోడ్డు నిర్మించాలని చెప్పారు. తనకు తెలియజేయకుండా సిద్దాపూర్ రోడ్డులో ఏ డబ్బానూ తొలగించవద్దని స్పష్టం చేశారు. చిరు వ్యాపారులు, పాన్‌షాపులు, పూల దుకాణాలు, మటన్, చికెన్ దుకాణాలకు ఇబ్బంది కలగకుండా పనులు జరగాలన్నారు. సిద్దాపూర్ కూడలిలో ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా జంక్షన్ అభివృద్ధి చేయాలని సూచించారు. మధ్యలో విగ్రహం ఏర్పాటుకు అనువుగా సర్కిల్ రూపకల్పన చేయాలని చెప్పారు. రోడ్డు పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సిద్దాపూర్ రోడ్డు పనులకు సంబంధించి రూ.2 కోట్ల నిధులు మిగిలి ఉన్నాయని, మున్సిపాలిటీలో టీఎఫ్ఐడీసీకి చెందిన మరో రూ.5 కోట్ల నిధులు కూడా అందుబాటులో ఉన్నాయని సమీక్షలో ప్రస్తావించారు. కలెక్టర్‌తో సమావేశం అనంతరం సంబంధిత శాఖల సమన్వయంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. సరైన లెవల్స్, డ్రైన్లు, కల్వర్టులతో కూడిన 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి అక్టోబర్ 30లోగా అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.పట్టణం, మండలంలోని సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు రోజూ ఒక ప్రాంతంలో పర్యటిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. త్వరలో ఊబ చెరువును పరిశీలిస్తానన్నారు.



## ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు



**మిర్యాలగూడ అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ డివిజన్ లోని వివిధ మండల కేంద్రాలు, గ్రామాల్లో పట్టణంలో వాడవాడ గల్లీ గల్లీ ఎంగిలి పూల బతకమ్మతో 9 రోజుల బతుకమ్మ సంబరాలు శనివారం ప్రారంభ మయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం, హౌసింగ్ బోర్డు వెంకటేశ్వర టెంపుల్ పక్కన మైదానం, గాయత్రి గేటెడ్ అవెన్యూ, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణం, రెడ్డి కాలనీ కోదండరామాలయం, ఈదులగూడ, ఎన్ఎస్పి క్యాంపులోని ఆంజనేయాలు, ప్రతి వాడలోను బతుకమ్మలు నిర్వహించారు. కొంతమంది మహిళలు భారీ బతుకమ్మలను రిక్షాలో తీసుకువచ్చారు. బతుకమ్మలో ఎమ్మెల్యే సతీమణి బి.మాధవి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ సతీమణి, మునిసిపల్ చైర్మన్ చిలుకూరు సుధా బాలకృష్ణ బతుకమ్మ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీషనవీన్, గ్రామీణఅభివృద్ధి ఎపిడి గార్లపాటి జ్యోతిలక్ష్మి, మునిసిపల్ మాజీ చైర్మన్ తిరునగరు నాగలక్ష్మి భార్గవ్, ఐద్వా నాయకులు పాదురు గోవర్ధన, సాధన, రమ్య, యాదమ్మ, మంజుల, పద్మలు పాల్గొన్నారు. బతుకమ్మ కేంద్రాల వద్ద మున్సిపాలిటీ అధికారులు పారిశుద్యం, విద్యుత్దీపాలు ఏర్పాటు చేశారు. డిఎస్పి జి.రవి ఆధ్వర్యంలో ఒన్ టూ టౌన్,రూరల్ ఇన్స్పెక్టర్లు నావభూషణం,సోమనర్సయ్య, ప్రసాద్,ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు.

# సంక్షేమ పథకాలే కాంగ్రెస్ విజయానికి బలం

- ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి
- సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి
- కాంగ్రెస్ శ్రేణులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపు





**ఖమ్మం, అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం–నల్గొండ–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. ఖమ్మం పట్టణంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించాలంటే పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని భట్టి విక్రమార్క అన్నారు. జిల్లా స్థాయి సమావేశం అనంతరం ఐదు శాసనసభ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించాలని, ఆ తర్వాత మండల, గ్రామస్థాయిల్లో సమావేశాలు ఏర్పాటు చేసి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గానికి సీనియర్ నాయకుడిని ఇన్‌ఛార్జిగా నియమించి, వారి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని కోరారు. గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం ప్రస్తుత ఎన్నికల ప్రక్రియకు అనుగుణంగా మళ్లీ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. కాంగ్రెస్ కుటుంబాల్లోని పట్టభద్రులను గుర్తించి, వారంతా ఓటర్లుగా నమోదయ్యేలా చూడాలని చెప్పారు. అనంతరం తటస్థ ఓటర్లను, ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల సానుకూలంగా ఉన్న ఇతర వర్గాల పట్టభద్రులను కలిసి పార్టీ అభ్యర్థికి మద్దతు కూడగట్టాలని సూచించారు.

**3.42 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ**

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్న ప్రయోజనాలను ఇంటింటికీ వివరించాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సుమారు కోటి 15 లక్షల కుటుంబాలు ఉండగా, దాదాపు కోటి 6 లక్షల కుటుంబాలకు చెందిన 3 కోట్ల 42 లక్షల మందికి ప్రతి నెలా ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు లభించే సన్నబియ్యాన్ని పేదలకు ఉచితంగా అందించడం ద్వారా ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, సుమారు 72 లక్షల మంది రైతులకు రైతు భరోసా ఆర్థిక సహాయం అందించామన్నారు. గృహజ్యోతి పథకం కింద సుమారు 53 లక్షల మందికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పథకాల వల్ల కుటుంబాలపై విద్యుత్ బిల్లుల భారం తగ్గుతోందని చెప్పారు. సామాజిక భద్రతలో భాగంగా సుమారు 43 లక్షల మందికి చేయూత పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు వైద్య చికిత్స పొందే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఈ పథకం అండగా నిలుస్తోందన్నారు. విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో సుమారు 12.5 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారంతో పాటు ఒక గ్లాసు పాలు అందించే కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తుందని వివరించారు.

**ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం**

రాష్ట్రంలో ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని చెప్పారు. తొలి దశలో 4.5 లక్షల ఇళ్లకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. రెండో దశలో మరో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేసే దిశగా, ఒక్కో నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున ముందుకు సాగుతున్నామని వివరించారు. హైదరాబాద్‌లోనూ పేదలకు లక్ష ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం 40 వేలకోట్ల రూపాయలు వెచ్చిస్తున్నదని చెప్పారు.

**ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రతే లక్ష్యం**

ఇందిరమ్మ జయంతి సందర్భంగా నవంబర్ 19న ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. కుటుంబానికి ఆదాయాన్ని సమకూర్చే పెద్ద వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే, ఆ కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం అందించేలా ఈ పథకాన్ని రూపొందిస్తున్నామని వివరించారు. కులం, మతం, ప్రాంతం వంటి భేదాలు లేకుండా తెలంగాణలోని కుటుంబాలకు భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను కరపత్రాల రూపంలో రూపొందించి ప్రతి ఇంటికీ అందించాలని భట్టి విక్రమార్క పార్టీ నాయకులకు సూచించారు.

**కాంగ్రెస్‌కు అంకితమైన కుటుంబం నుంచి సర్వోత్తమ్ రెడ్డి**

రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం ఉందని పేర్కొన్నారు. రాంరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర్ రెడ్డి వంటి నాయకుల కుటుంబం పార్టీకి అవసరమైన ప్రతి సందర్భంలో అండగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ కోసం నిబద్ధతతో పనిచేసిన ఈ కుటుంబాన్ని పార్టీ ఎప్పటికీ మరిచిపోదని చెప్పారు. సర్వోత్తమ్ రెడ్డిని కేవలం ఒక అభ్యర్థిగా కాకుండా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా భావించి ఆయన విజయం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు నుంచి ఎన్నికల్లో ఓటు వేసే వరకు ప్రతి దశలోనూ అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది ఉన్న ప్రాంతమని పేర్కొంటూ, అదే ఐక్యతను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చాటాలని, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్ట రాగమయి, కోరం కనకయ్యలు ప్రసంగించారు. ఈ సమావేశానికి డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యం

- ఖమ్మం జిల్లా అంటేనే, కాంగ్రెస్ కంచుకోట
- నవంబర్ 6లోగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి కావాలి
- మండలాన్ని యూనిట్‌గా తీసుకొని విస్తృతం చేయాలి
- తొలి ప్రాధాన్య ఓటుతోనే సర్వోత్తమ్‌రెడ్డి గెలుపు ఖాయం
- త్వరలో మరో 14 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు
- ఖమ్మం - నల్లగొండ - వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





**ఖమ్మం, అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం–నల్లగొండ–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి విజయం నల్లేరు మీద నడకేనని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తొలి ప్రాధాన్య ఓటుతోనే భారీ మెజారిటీ సాధించేలా పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు.

**త్వరలో మరో 14 వేల ఉద్యోగాలు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో 75 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. మరో 14 వేల పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్లు విడుదల చేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా పెండింగ్ బకాయిలను చెల్లించామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని తెలిపారు.

**నవంబరు 6లోగా ఓటరు నమోదు**

ఎన్నికల్లో విజయం సాధించేందుకు పట్టభద్రుల ఓటరు నమోదు కీలకమని పొంగులేటి పేర్కొన్నారు. నవంబరు 6లోగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పట్టభద్రుల సహకారంతో గ్రామగ్రామాన ఆన్‌లైన్ ద్వారా ఓటరు నమోదును విస్తృతంగా చేపట్టాలన్నారు. జెన్ జీ తరం వేగంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లి 95 శాతం పోలింగ్ సాధించేలా ప్రణాళిక రూపొందించాలని కోరారు.

**విపక్షాల ప్రచారాన్ని తిప్పికొట్టాలి**

రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి కుటుంబానికి నాలుగు తరాలుగా కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉందని మంత్రి తెలిపారు. తమ అభ్యర్థిపై విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తూ సానుభూతి ఓట్లు పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. పట్టభద్రులు ఇలాంటి ప్రచారాలను గమనించాలని కోరారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోట అని, పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యూహాత్మకంగా పనిచేసి అభ్యర్థికి అఖండ విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు.పలువురు నేతల హాజరుఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు ఉపశమన సంరక్షణ

- యువతలో మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు






**ఖమ్మం, అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ హాస్పిస్ మరియు ఉపశమన సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జిజిహెచ్ ) లోని పాలియేటివ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణా దేవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ రామారావు, డి ఎం హెచ్ ఓ, మాట్లాడుతూ తీవ్రమైన ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు శారీరక నొప్పి నుంచి ఉపశమనం కల్పించడంతో పాటు, మానసిక ధైర్యాన్ని అందించడంలో ఉపశమన సంరక్షణ సేవలు కీలక పాత్ర పోషిస్తాయని, రోగుల జీవన నాణ్యతను మెరుగుపరచడం, వారి కుటుంబాలకు అవసరమైన సహకారం అందించడం ఈ సేవల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం ఆయన ఆసుపత్రిలోని రోగులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. కిరణ్ కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, ఎన్‌సీడీ సెల్ డీఈఓ నాగేంద్రాచారి, ఎన్. సచినారాయణ, పాలియేటివ్ కేర్ సిబ్బంది అశోక్, సుమలత, సుజాత, నాగమణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం**

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని న్యూ విజన్ కళాశాలలో నిర్వహించిన మానసిక ఆరోగ్య అవగాహన సదస్సులో డాక్టర్ డి రామారావు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణాదేవి పాల్గొని విద్యార్థులకు మానసిక ఆరోగ్య ప్రాధాన్యతను వివరించారు.ఈ సందర్భంగా పీఓ డాక్టర్ అరుణాదేవి మాట్లాడుతూ నేటి యువత, విద్యార్థుల్లో పెరుగుతున్న మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలను గుర్తించి, వాటిని అధిగమించేందుకు సరైన అవగాహన అవసరమని , మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైనప్పుడు నిపుణుల సహాయం తీసుకోవాలని , మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవడం, సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా విద్యార్థులు చదువులోనూ, వ్యక్తిగత జీవితంలోనూ మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సోహేల్, ఎన్‌సీడీ సెల్ డీఈఓ నాగేంద్రాచారి, ఎన్. సచినారాయణ, న్యూ విజన్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎంఎల్సీ సన్నాహక సమావేశం విజయవంతం : నూతి, నాగండ్ల



**ఖమ్మం, అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం –నల్గొండ – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సి ఎన్నికల సన్నాహక సమావేశం జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ల ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత జాతిపిత మహాత్మా గాంధీ, భారత దేశ మొట్ట మొదటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి అనంతరం మన తెలంగాణ రాష్ట్రీయ గీతాన్ని, జాతియ గీతాన్ని ఆలపించి సమావేశం ప్రారంభించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు , రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , పార్లమెంట్ సభ్యులు రామాసహాయం రఘురాంరెడ్డి , శాసనసభ సభ్యులు మట్టా రాఘమయిదయానంద్, మాలోత్ రాందాస్ నాయక్ , కోరం కనకయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రేణులు అందరు కంకణ బద్దులై పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములై పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తంరెడ్డిని గెలిపించాలని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, మాజీ శాసనమండలి సభ్యులు పోట్ల నాగేశ్వరావు, బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకలల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాలరెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, టి పి సి సీ ప్రధాన కార్యదర్శి బేబీ స్వర్ణకుమారి, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భానోత్ బాలాజీ నాయక్, రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు వడ్డెబోయిన నరసింహారావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి అంజనీ కుమార్,జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ మానుకొండ రాధాకిశోర్, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, బొడ్డు బొందయ్య, పుచ్చకాయల వీరభద్రం, మొక్క శేఖర్ గౌడ్, సయ్యద్ హుస్సేన్, అసిఫ్, విప్లవ కుమార్, యాసిన్, జిల్లా, నగర కాంగ్రెస్ కమిటి కార్యవర్గ సభ్యులు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన శ్రేణులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి లు ధన్యవాదాలు తెలిపారు.

# జనప్రియ క్వార్టర్స్‌లో నూతన సీసీ రోడ్డు ప్రారంభం



**కొత్తపేట, అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**

కొత్తపేట డివిజన్ పరిధిలోని జనప్రియ క్వార్టర్స్ బ్లాక్ నంబర్ 10 నుండి జనప్రియ కమాన్ వరకు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఈరోజు కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్ ప్రారంభించారు.గతంలో ఈ రహదారి గుంతలమయంగా ఉండటంతో కాలనీ నివాసులు, అపార్ట్మెంట్ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. నూతన సీసీ రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్ గారిని అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జనప్రియ క్వార్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ స్వరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ అశ్విన్ సింగ్ ఠాకూర్, శ్రీ శంభు, అసోసియేషన్ సభ్యులు, స్థానిక నివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మ ఆలయానికి బీరువా విరాళం



**శామీర్‌పేట, అక్టోబరు11 (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీ కనకదుర్గ అమ్మవారి సేవా నిమిత్తం అలియాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్ బీరువాను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ఆయన కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అబ్బాగౌని భాస్కర్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ సామల జశ్వంత్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, మాజీ సర్పంచ్ ఏళ్ల మల్లేష్, కుడుముల వెంకటేష్, అబ్బాగౌని వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డిని సన్మానించిన కొప్పుల ప్రభావతి రెడ్డి.



**ఏన్కూర్, అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం పట్టణంలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో శనివారం ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన సభలో ఏన్కూరు మండలానికి చెందిన జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రభావతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రభావతి రెడ్డి మాట్లాడుతూ దివంగత నేతలు రామ్ రెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర్ రెడ్డిలు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రులుగా పనిచేసి ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ సేవలందించిన ఆ నాయకుల కుటుంబానికి ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వారి సేవా భావం, ప్రజలతో ఉన్న అనుబంధం చిరస్మరణీయమని పేర్కొన్నారు.పట్టభద్రుల సమస్యల పరిష్కారం, నిరుద్యోగుల సంక్షేమం, విద్యావంతుల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి పట్టభద్రుల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు.అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనేందుకు అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ప్రభావతి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, అర్హులైన వారంతా ఓటరు నమోదుపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం

- పితృపక్షాల్లో అన్నదానం పుణ్యప్రదం : నంగునూరు సత్యనారాయణ.
- బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో ప్రచారం వద్దు రంఅన్నదానం మహాదానం : అయిత సత్యనారాయణ





**గజ్వేల్, అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని అంగడిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద పితృపక్షాల సందర్భంగా మహాలయ అమావాస్యను పురస్కరించుకుని శనివారం వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులకు దక్షిణ, సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.సి. రాజమౌళి, కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, డాక్టర్ లింగం, ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్నదానం మహాదానమని పేర్కొన్నారు. పితృపక్షాల సమయంలో అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం పుణ్యప్రదమని పురాణాలు చెబుతున్నాయని తెలిపారు. వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న ప్రతి ఒక్కరిపై దేవదేవతల అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు. మహాలయ అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, లయన్స్ క్లబ్ సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు, ఇతర సేవాభిమానులు పాల్గొన్నారు.

# నల్సార్ జంక్షన్‌లో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం

- ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు





**శామీర్‌పేట, అక్టోబరు11(జర్నలిస్ట్ ఫైల్) :**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని ట్రిముల్‌ఘెర్రీ ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు సూచించారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్ స్పాట్‌గా గుర్తించిన నల్సార్ జంక్షన్‌లో శనివారం నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వాహనదారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకూడదని, నిర్ణీత వేగ పరిమితులను పాటించాలని, లేన్ క్రమశిక్షణను అనుసరించాలని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాంతకమని, ట్రాఫిక్ సిగ్నళ్లను గౌరవించాలని, పాదచారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.జంక్షన్లు, పాదచారుల దాటే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సేవల వాహనాలకు దారి ఇవ్వాలని అవగాహన కల్పించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ప్రాణనష్టంతో పాటు కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోతాయని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతను తమ బాధ్యతగా భావించాలని సూచించారు.'మీ భద్రత మీ చేతుల్లోనే ఉంది.. సురక్షితంగా ప్రయాణించండి.. క్షేమంగా గమ్యస్థానానికి చేరుకోండి' అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రహదారి భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించి ప్రమాదాలను తగ్గించడమే 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. పవన్ కుమార్ రెడ్డి, అదనపు ఇన్‌స్పెక్టర్ జి. జనకీరాములు, ఎస్ఐలు ఎ. నవీన్ రెడ్డి, ఎం. కిషోర్, హెచ్‌కేఆర్ రోడ్‌వేస్ ప్రతినిధి బాలరాజు, రోడ్ సేఫ్టీ ఎస్ఐ జోజి, వారి బృందం పాల్గొన్నారు.

# జిల్లాల పునర్వ్యవస్థీకరణతో ప్రజలకు చేరువైన పాలన : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి, అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**

జిల్లాల పునర్వ్యవస్థీకరణతో పరిపాలన ప్రజలకు చేరువై, ప్రభుత్వ సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. తెలంగాణలో 10 జిల్లాలను 33 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతూ, జిల్లాల ఆవిర్భావ దశాబ్ది సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌ను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాల విభజనతో జిల్లా కేంద్రాలు ప్రజలకు చేరువయ్యాయని, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు ప్రజలు దూర ప్రాంతాలకు ప్రయాణించే ఇబ్బందులు తగ్గాయని పేర్కొన్నారు. అధికార వికేంద్రీకరణ ద్వారా స్థానిక సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు మరింత అవకాశం ఏర్పడిందన్నారు.ప్రజలకు సత్వర సేవలు అందించడం, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ కీలక పాత్ర పోషించిందని ఎమ్మెల్యే వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉండే పాలనతోనే ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా అందుతాయని ఆయన పేర్కొన్నారు.

# దుప్ప తండా గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలప స్వాధీనం



**సిరికొండ, అక్టోబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**

సిరికొండ మండల పరిధిలోని దుప్ప తండా గ్రామానికి చెందిన మాలావత్ తిరుపతి నివాసంలో అక్రమంగా టేకు కలప నిల్వ ఉంచినట్లు అటవీ శాఖ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో సమాచారం అందింది.ఈ సమాచారం మేరకు, తేదీ 10.10.2026న అటవీ శాఖ సిబ్బంది సదరు వ్యక్తి నివాసాన్ని తనిఖీ చేయగా, అక్కడ టేకు కలప నిల్వ ఉంచినట్లు గుర్తించారు. దీంతో అటవీ శాఖ అధికారులు (23) టేకు దుంగలను స్వాధీనం చేసుకొని, తదుపరి చర్యల నిమిత్తం సిరికొండ అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు.ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు

## రాజరాజేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిచ్చిన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ): బ్రహ్మంగారిమఠం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నందు దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఆదివారం అమ్మవారి శాలయందు గో పూజ చేసి ఆర్యవైశ్య మహిళా మణులతో 108 కళాశాలతో కలశ మహోత్సవం గ్రామ పురవీధుల గుండా వెళ్లి స్వామి మఠం ఈశ్వరి దేవి మఠం సందర్శించుకుని అనంతరం ఉభయదాతలు అమ్మవారి శాల యందు హోమంలో పాల్గొనడం జరిగింది. సాయంత్రం ఆర్యవైశ్య మహిళా మణులతో కుంకుమార్చన నిర్వహించడం జరిగిందిలితొలి రోజు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో ఆదివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నందు వాసవి అమ్మవారు మొదటి రోజు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

### బాధిత కుటుంబానికి రూ.4.10 లక్షల సహాయం



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మెసెంజర్గా పనిచేస్తున్న కటారి కృష్ణ ఇటీవల గుండెపోటుతో హఠాన్మరణం చెందిన విషయం తెలిసిందే. ఈయనకు భార్య,ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. కటారి కృష్ణ బ్యాంక్ లో పనిచేయుచున్న సమయంలో అందరికీ నాలుకలా ఉండే. దీంతో ఈయన మంచితనాన్ని గుర్తించిన స్థానికులు అందరూ పోగై వీరి కుటుంబానికి తోచిన మటుకు ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది. స్థానికులు,దాతలు స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి మొత్తం రూ. 4.10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సహాయం అందించిన వారికి బాధిత కుటుంబ సభ్యులు,గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని స్థానికులు హామీ ఇచ్చారు.

## పేద కుటుంబాలను ఆదుకుంటున్న సీఎం సహాయ నిధి : చీఫ్ విప్ జీవీ



వినుకొండ( జర్నలిస్ట్ ఫైల్ ): సీఎం సహాయనిధి పేదల పాలిటి పెన్నిదని ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లి160 మంది లబ్ధిదారులకు,74 లక్షల 31వేల రూపాయల చెక్కులను ఆదివారం తన కార్యాలయంలో చీఫ్ విప్ జీవీ పంపిణీ చేశారు. వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్యసహాయం కోసం సీఎం చంద్రబాబు నాయుడు అందించిన నిధులు, తమకు అందేలా కృషిచేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీకి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, జనసేన నాయకులు నిస్సంకర శ్రీనివాసరావు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇది ప్రజాస్వామ్య దేశమా?నియంతలా రాజ్యమా

- ఢిల్లీలో విద్యార్థులు, యువజనులు, వామపక్ష నాయకులను పోలీసుల అరెస్టు లాఠీచార్జి అప్రజాస్వామికం!
- అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అణచలేరు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు




కాకినాడ, (జర్నలిస్ట్ ఫైల్ ):ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని సర్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఢిల్లీలో విద్యార్థులు, యువజనులు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలపై పోలీసులు లాఠీచార్జి చేయడం, నిరసనకారులను అరెస్టు చేసి నిర్బంధించడం అప్రజాస్వామిక చర్య అని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తీవ్రంగా ఖండించిందిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు విమర్శించారు

ఈ ఘటనకు నిరసనగా సీపీఐ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం కాకినాడలో సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన స్థానిక మదర్ థెరిస్సా విగ్రహం వద్ద నుంచి కోకిల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తాటిపాక మధు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం అని అన్నారు ఎన్నికల వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతూ, ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీనామాను డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన తెలిపే విద్యార్థులు, యువజనులపై పోలీసుల బలప్రయోగం చేయడం, అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తుందిని మధు అభిప్రాయపడ్డారు

ప్రజల ఓటు హక్కు, ఎన్నికల పారదర్శకత, రాజ్యాంగ పరిరక్షణ కోసం గొంతెత్తే వారిని లాఠీలతో భయపెట్టలేరు. అరెస్టులతో ప్రజల ప్రశ్నలను సమాధి చేయలేరు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను, రాజ్యాంగబద్ధ సంస్థలను ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ ఉంది. ఆ హక్కును గౌరవించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన వ్యవస్థలే ప్రజల నిరసన గొంతును నొక్కే పరిస్థితి రావడం ఆందోళనకరం. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో వ్యక్తమవుతున్న అనుమానాలకు సమాధానం చెప్పాల్సింది పోయి, నిరసనకారులపై పోలీసు బలప్రయోగానికి పాల్పడటం సమస్యను మరింత తీవ్రతరం చేస్తుందిని మధు అన్నారు

ంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఢిల్లీలో నిరసనకారులపై జరిగిన లాఠీచార్జి, అరెస్టులపై సమగ్ర విచారణ జరిపించాలని, అక్రమంగా నిర్బంధించిన వారిని విడుదల చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించే చర్యలు చేపట్టాలని కోరింది.

ప్రజా ఉద్యమాలను అణచివేయాలని చూస్తే పోరాటాలు ఆగవు.

ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం వామపక్షాలు, విద్యార్థులు, యువజనులు మరింత ఐక్యంగా ఉద్యమిస్తారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునే వరకు ప్రజాస్వామ్య పోరాటం కొనసాగుతుందిని అన్నారు

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె బోడకొండ సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కేత అరుణ, మల్లాల్సి శ్యామ్ పాండుఅశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దసరా శరన్నవరాత్రులు



కానూరు ( జర్నలిస్ట్ ఫైల్ ): దసరా శరన్నవరాత్రుల సందర్భంగా మచిలీపట్నం మండలం కానూరు పంచాయతీ పరిధిలోని సత్యనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గమ్మ అమ్మవారి మండపాన్ని కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ తన ధర్మపత్ని సమేతంగా సందర్శించి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వారు ప్రార్థించారు. దసరా నవరాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తున్న భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో గోపు ప్రతాప్ నరేష్ కుమార్, గోపు నాగ మహేష్ బాబు, బొలిశెట్టి నాని, గోపు వెంకటరమణ, చిటికినేటి అయ్యప్ప, ఇవన వెంకన్న, ఇవన చిన్న తదితరులు, అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

## ఎవరైనా మూడు పూటలు తింటారు.. ఆమె ప్రతి 3 నిమిషాలకు తింటుంది: అమితాబ్



- దీపిక పదుకొణె ప్రతి 3 నిమిషాలకు ఏదో ఒకటి తింటుందని చెప్పిన అమితాబ్
- 'కౌన్ బనేగా కరోడ్‌పతి' షోలో దీపిక ఆహారపు అలవాట్లపై సరదా చర్చ
- తాను డబ్బా తెరిచినప్పుడల్లా అమితాబ్ అడిగేవారని దీపిక కౌంటర్
- ఇంటి నుంచి ఫుడ్ తెస్తాను కాబట్టే దీపిక నాతో పనిచేస్తుందన్న ఫరాఖాన్
- తారల మధ్య జరిగిన ఫన్నీ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్, స్టార్ హీరోయిన్ దీపిక పదుకొణె మధ్య ఉన్న అనుబంధం గురించి అందరికీ తెలిసిందే. వీరిద్దరూ కలిసి 'పీకూ' వంటి సూపర్ హిట్ చిత్రంలో నటించారు. అయితే, దీపిక ఆహారపు అలవాట్ల గురించి అమితాబ్ చేసిన ఓ సరదా వ్యాఖ్య ఇప్పుడు వైరల్ అవుతోంది. 'కౌన్ బనేగా కరోడ్‌పతి' షోకి దీపిక పదుకొణె, ప్రముఖ దర్శకురాలు ఫరాఖాన్ అతిథులుగా హాజరైనప్పుడు ఈ ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది.

ఈ సందర్భంగా అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ, దీపిక ఆహారపు అలవాట్ల గురించి ఓ రహస్యం చెప్పారు. "సాధారణంగా ఒక వ్యక్తి రోజుకు మూడుసార్లు భోజనం చేస్తారు. కానీ, దీపిక మాత్రం ప్రతి మూడు నిమిషాలకు ఏదో ఒకటి తింటూనే ఉంటుంది.

నేను ఇది స్వయంగా చూశాను. ప్రతి మూడు నిమిషాలకు ఎవరో ఒకరు ఒక బౌల్‌లో ఆమె కోసం ఆహారం తీసుకొస్తారు. కానీ, ఒక్కసారి కూడా, మీరు కూడా తింటారా అని అడగదు" అంటూ బిగ్ బీ సరదాగా ఫిర్యాదు చేశారు.

అమితాబ్ వ్యాఖ్యలకు దీపిక వెంటనే కౌంటర్ ఇచ్చారు.

అసలు కథ వేరే ఉందని, "నేను ఎప్పుడు నా ఫుడ్ డబ్బా తెరిచినా, అమిత్ జీ నా దగ్గరికి వచ్చి 'ఏం తింటున్నావ్' అని పదేపదే అడిగేవారు" అని నవ్వుతూ చెప్పారు. దీనికి అమితాబ్ స్పందిస్తూ, "ఈ షోలో అబద్ధాలు చెప్పడానికి అనుమతి లేదు!" అని అనడంతో సెట్‌లో నవ్వులు పూశాయి.

ఈ సరదా చర్చలో ఫరాఖాన్ కూడా పాల్గొన్నారు. దీపిక తనతో ఎందుకు పనిచేస్తుందో అసలు రహస్యం చెప్పారు. "దీపిక నాతో సినిమాలు చేయడానికి కారణం ఇదే. నేను ఆమె కోసం ఇంటి నుంచి భోజనం తెస్తాను" అని ఫరా తెలిపారు.

ఈ క్రమంలో అమితాబ్.. తనకు ఫరా ఎప్పుడూ ఇంటి బిర్యానీ పంపలేదని సరదాగా ఫిర్యాదు చేశారు. దీనికి ఫరాఖాన్ స్పందిస్తూ, "సర్, మా ఇంట్లో కేవలం వెజ్ పులావ్ మాత్రమే ఉంటుంది" అని ఫన్నీగా వివరణ ఇచ్చారు.

కాగా, ఫరాఖాన్ దర్శకత్వం వహించిన 'ఓం శాంతి ఓం' చిత్రంతోనే దీపిక పదుకొణె బాలీవుడ్‌కు పరిచయమయ్యారు.

ఆ తర్వాత అమితాబ్, దివంగత ఇర్ఫాన్ ఖాన్‌లతో కలిసి ఆమె నటించిన 'పీకూ' చిత్రం విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్‌గానూ భారీ విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే.

### దీపావళి కానుకగా 'రామాయణం: పార్ట్ 1'

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): భారత సినీ చరిత్రలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణం: పార్ట్ 1'. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది.

రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, కన్నడ రాకింగ్ స్టార్ యశ్ రావణుడిగా నటిస్తున్న ఈ చిత్రం 2026 నవంబర్ 5న దీపావళి పండుగకు ముందుగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నవరాత్రుల శుభ సందర్భంగా ఈ ప్రకటన చేస్తూ, చిత్రంలోని ప్రధాన తారాగణంతో కూడిన ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.

# ప్రజా ఉద్యమాలపై నిర్బంధ కాండను ఖండించండి

- ఎలక్షన్ కమిషన్ రాజీనామా చేసే వరకు ప్రజా ఉద్యమం ఆగదు
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కంకణాల ఆంజనేయులు



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకు ప్రజా ఉద్యమాలు ఆగవని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కంకణాల ఆంజనేయులు అన్నారు. సర్‌ను రద్దు చేయాలని సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని బ్రహ్మం గారిమఠం లోని 5రోడ్ల సెంటర్ నందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ జ్ఞానేశ్ కుమార్ ను కేంద్ర ప్రభుత్వం అక్రమ పద్ధతుల్లో ఎన్నికల కమిషనర్ గా నియమించిందని అన్నారు. తమకు అనుకూలమైన ఓట్లను పెంపొందించుకొని, వ్యతిరేకమైన ఓట్లను కుదించే విధంగా ఓటర్ లిస్ట్ ను తయారు చేయడం వంటి పద్ధతిని బిజెపి డైరెక్షన్ లో ఎలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించబడిన ఓట్లన్నీ విదేశాల నుంచి అక్రమంగా చొరబడి వచ్చిన వారే అని దేశ ప్రజలను మభ్యపుచ్చే విధంగా బిజెపి ప్రచారం చేస్తున్నదని అన్నారు. ఈ కాలంలో జరిగిన 8 రాష్ట్రాల ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ ఈ తరహా లోనే బిజెపికి అనుకూలంగా వ్యవహరించిందని అన్నారు. బెంగాల్లోని భవానీపూర్ మమతా బెనర్జీ నియోజకవర్గంలో 47,094 ఓట్లు తొలగించారని, ఆమె 15,102 ఓట్లతో ఓడిపోయారని తెలిపారు. తమిళనాడులోనీ కోలట్టూరు లో 83,402 ఓట్లు తొలగించారని, 8,597 ఓట్లతో స్టాలిన్ ఓడిపోయారని అన్నారు. తమకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారి పట్ల, వ్యతిరేకిస్తారు అనే ఓట్ల పట్ల ప్రభుత్వం ఈ పద్ధతిలోనే అనుసరిస్తున్నదని అన్నారు. దేశంలో 13.85 కోట్ల ఓట్లు సర్ పేరుతో తొలగించారని అన్నారు. భారత రాజ్యాంగం వయోజనులందరికీ కల్పించిన ఓటు హక్కును కొందరికి పరిమితం చేసే విధంగా, అప్రజాస్వామిక పద్ధతులో బిజెపి, ఎలక్షన్ కమిషన్ కలిసి వ్యవహరించటం చట్టరీత్యా నేరమని, వారిని గద్దె దించాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. సభలు పెట్టుకోవటం, అన్యాయాన్ని ప్రశ్నించడం, నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని అన్నారు. ఢిల్లీలోను, దేశవ్యాప్తంగా ఎలక్షన్ కమిషన్ అక్రమాలను ప్రశ్నించిన, నిరసించిన వారిని బిజెపి ప్రభుత్వం అరెస్టులు చేయడం, నిర్బంధానికి గురి చేయటం రాజ్యాంగాన్ని ధిక్కరించటమేనని అన్నారు. ప్రజాతంత్ర వాదులంతా బిజెపి నిరంకుశత్వంపై నిరసన తెలపాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు జి.శివకుమార్, వి,అన్వేష్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ అక్రమాలపై దేశమంతా గగ్గోలు పెడుతుంటే మన రాష్ట్రంలో ఉన్న టిడిపి, జనసేన, వైసీపీ లాంటి పార్టీలు స్పందించకపోవడం విచారకరమని అన్నారు. రాష్ట్రంలో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్న ఈ పార్టీలు కేంద్రంలో బిజెపికి వాంతపడటం సిగ్గుచేటని అన్నారు. దేశంలో ఆధార్ కార్డు అన్నిటికీ గుర్తింపు కార్డుగా ఉంటే, ఓటు కార్డుకు దాన్ని పరిగణలోకి తీసుకోకపోవడం అన్యాయం అని అన్నారు. ప్రపంచంలో గొప్ప ప్రజాస్వామ్య దేశం అని చెప్పుకుంటున్న మన దేశం జీవించి ఉన్న ఓటర్లను హత్య చేసిందని అన్నారు. ఇది ఒక రకంగా ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడం లాంటిదేగాని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన పాలకులు, రాజ్యాంగం కల్పించిన హక్కులను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. బిజెపి అండతో ఎలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్న అక్రమాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని ప్రజాతంత్ర వాదులంతా బలపరచాలని, ప్రజా ఉద్యమాలపై నిర్బంధకాండను ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి గండి సునీల్ కుమార్ అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వీరయ్య,మండల అధ్యక్షులు హరి, షరీఫ్, జహంగీర్ లాజర్, రమనమ్మ, అజయ్,రాహుల్, వీరభద్రుడు, తమస్ చిన్నక్క, కళావతి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వయసుతో పాటు గుండె లయ తప్పుతోందా?.. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దు!

- వయసు పెరిగేకొద్దీ సాధారణమయ్యే గుండె లయ సమస్య 'ఏట్రియల్ ఫిబ్రిలేషన్'
- ఈ సమస్య ఉన్నవారిలో స్ట్రోక్ వచ్చే ప్రమాదం 3 నుంచి 5 రెట్లు అధికం
- గుండె దడ, అలసట, ఆయాసం వంటివి దీని ప్రధాన లక్షణాలు
- భారత్‌లో సుమారు 79 లక్షల మంది ఈ సమస్యతో బాధపడుతున్నారని అంచనా
- లక్షణాలను ముందుగా గుర్తించి చికిత్స తీసుకోవడం అత్యంత ముఖ్యమంటున్న నిపుణులు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):శరీరంలో అనేక మార్పులు రావడం సహజం. అయితే, కొన్ని మార్పులను సాధారణమైనవిగా భావించి నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. అలాంటి వాటిలో ముఖ్యమైనది గుండె లయకు సంబంధించిన సమస్య అయిన 'ఏట్రియల్ ఫిబ్రిలేషన్' (ఏఫీబ్/ఎఎఫ్). ఇది వయసుతో పాటు సర్వసాధారణంగా కనిపించే సమస్య అయినప్పటికీ, దీనిని వృద్ధాప్యంలో ఒక సాధారణ భాగంగా పరిగణించకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సకాలంలో గుర్తించకపోతే ఇది స్ట్రోక్ వంటి ప్రాణాంతక పరిస్థితులకు దారితీసే ప్రమాదం ఉంది.

**ఏమిటీ ఏట్రియల్ ఫిబ్రిలేషన్?**

సాధారణంగా మన గుండె ఒక నిర్దిష్టమైన లయతో కొట్టుకుంటుంది. అయితే, ఏట్రియల్ ఫిబ్రిలేషన్ ఉన్నవారిలో గుండె పై గదులైన కర్ణికలలో విద్యుత్ సంకేతాలు అస్తవ్యస్తంగా మారిపోతాయి. దీనివల్ల గుండె వేగంగా, అసాధారణ లయతో కొట్టుకోవడం మొదలవుతుంది. వయసు పెరిగే కొద్దీ ఈ సమస్య బారిన పడే వారి సంఖ్య పెరుగుతోంది. గణాంకాల ప్రకారం 60 ఏళ్ల వయసు వారిలో సుమారు 3 నుంచి 4 శాతం మందిలో ఈ సమస్య కనిపిస్తే, 80 ఏళ్లు వచ్చేసరికి ఇది 8 శాతానికి పెరుగుతుంది. మన దేశంలో దాదాపు 79 లక్షల మంది ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌తో జీవిస్తున్నారని ఒక అంచనా.

**వయసుతో పాటు ముప్పు ఎందుకు పెరుగుతుంది?**

వయసు పైబడటం వల్ల గుండె నిర్మాణంలో కొన్ని మార్పులు చోటుచేసుకుంటాయి. గుండె కండరాలు గట్టిపడటం, కర్ణికలు సాగడం లేదా వాటి పరిమాణం పెరగడం, గుండె కణజాలంలో మచ్చల వంటి ఫైబ్రోసిస్ ఏర్పడటం వంటి కారణాల వల్ల సాధారణ విద్యుత్ సంకేతాలకు అంతరాయం కలుగుతుంది. ఇది ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌కు దారితీస్తుంది.

**లక్షణాలు ఎలా ఉంటాయి?**

ఏట్రియల్ ఫిబ్రిలేషన్ లక్షణాలు వ్యక్తిని బట్టి మారుతూ ఉంటాయి. గుండె దడగా అనిపించడం, తీవ్రమైన అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది (ఆయాసం), నిలకడ లేకపోవడం లేదా కళ్లు తిరగడం వంటివి ప్రధాన లక్షణాలు. అయితే, వృద్ధులలో చాలామంది ఈ లక్షణాలను వయసు వల్ల కలిగే నీరసంగా లేదా ఇతర అనారోగ్య సమస్యలుగా పొరబడే అవకాశం ఉంది.

ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే.. కొందరిలో ఎలాంటి లక్షణాలు బయటకు కనిపించకపోవచ్చు. దీనివల్ల సమస్య ఉన్నట్టు తెలియక ప్రమాదం ముదిరిపోతుంది. సాధారణ గుండె లయ ఉన్నవారితో పోలిస్తే, ఏట్రియల్ ఫిబ్రిలేషన్ ఉన్నవారిలో స్ట్రోక్ వచ్చే ప్రమాదం 3 నుంచి 5 రెట్లు ఎక్కువగా ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

**ఇతర ప్రమాద కారకాలు, నివారణ**

వయసుతో పాటు మధుమేహం, దీర్ఘకాలిక అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్), గుండె ధమనుల వ్యాధులు, స్లీప్ అప్నియా (నిద్రలో శ్వాసకు అంతరాయం), అధికంగా మద్యం సేవించడం, ధూమపానం, కొన్నిసార్లు జన్యుపరమైన కారణాలు కూడా ఏట్రియల్ ఫిబ్రిలేషన్ ముప్పును పెంచుతాయి.

జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. క్రమం తప్పని వ్యాయామం, రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవడం, అతిగా మద్యం సేవించకపోవడం వంటివి చాలా అవసరం.

గుండె లయలో ఏదైనా అసాధారణ మార్పును గమనించినా లేదా పైన చెప్పిన లక్షణాలు తరచుగా కనిపిస్తున్నా వెంటనే వైద్యులను సంప్రదించాలి. సాధారణంగా ఈసీజీ (ఎలక్ట్రో కార్డియోగ్రామ్) పరీక్షతో ఈ సమస్యను నిర్ధారిస్తారు. అవసరమైతే, హోల్టర్ మానిటర్ వంటి అధునాతన పరీక్షలు సిఫారసు చేస్తారు. జనాభాలో వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌పై అవగాహన పెంచుకోవడం, లక్షణాలను ముందుగా గుర్తించి సరైన చికిత్స తీసుకోవడం ద్వారా తీవ్రమైన పరిణామాలను నివారించవచ్చు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే: రేవంత్ సంచలన ఆరోపణ



- గోవాలో రేవంత్ రెడ్డి పర్యటన
- సీఎం ప్రమోద్ సావంత్ లక్ష్యంగా ఆరోపణలు

**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గోవాలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గోవాను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కాదు, భూములు కబ్జా చేస్తున్న 'ప్రాపర్టీ సావంత్' అని ఆయన పదునైన విమర్శలు చేశారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'గోయ్ రాఖోన్న' (సేవ్ గోవా) యాత్రలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

బీజేపీ పాలనలో గోవా యువత నిరుద్యోగంతో నిరాశకు లోనవుతున్నారని, ప్రమాదకరమైన మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో పట్టుబడుతున్న డ్రగ్స్‌కు మూలాలు గోవాలోనే ఉన్నాయి. అక్కడి నుంచే దేశంలోని ప్రధాన నగరాలకు మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి" అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. దిశా డైలీ కథనం ప్రకారం, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లను కూల్చివేశామని, కానీ గోవా మాత్రం డ్రగ్స్‌కు ప్రధాన కేంద్రంగా మారిందని ఆయన తెలిపారు.

గోవా సీఎం ప్రమోద్ సావంత్‌పై విమర్శలు కొనసాగిస్తూ, ఆయన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గోవా అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, బీజేపీ ప్రభుత్వం స్థానిక ప్రజల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని మండిపడ్డారు.

రెండుసార్లు బీజేపీని నమ్మి గోవా ప్రజలు మోసపోయారని రేవంత్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును, యువతను కాపాడుకోవాలంటే బీజేపీ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

## డిజిటల్ అరెస్ట్ మోసం : రూ. 2.5 లక్షలు పోగొట్టుకుని విద్యార్థిని ఆత్మహత్య

- డిజిటల్ అరెస్ట్ మోసానికి పాట్నాలో యువతి ఆత్మహత్య
- సైబర్ నేరగాళ్లకు రూ. 2.5 లక్షలు సమర్పించుకున్న బాధితురాలు

**పాట్నా (జర్నలిస్ట్ ఫైల్):** సైబర్ నేరగాళ్లు పన్నిన 'డిజిటల్ అరెస్ట్' వలలో చిక్కుకుని ఓ యువతి ప్రాణాలు తీసుకుంది. ఈ దారుణ ఘటన బీహార్ రాజధాని పాట్నాలో చోటుచేసుకుంది. సుమారు రూ. 2.5 లక్షలు పోగొట్టుకోవడంతో పాటు నేరగాళ్ల వేధింపులు తట్టుకోలేక 22 ఏళ్ల గ్రాడ్యుయేట్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పాట్నాలోని కంకర్‌బాగ్ ప్రాంతానికి చెందిన యువతిని సెప్టెంబర్ నుంచి సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకున్నారు. తాము ప్రభుత్వ అధికారులమని నమ్మించి, చట్టపరమైన కేసులో ఇరికిస్తామని బెదిరించారు. ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసంతో భయపడిపోయిన బాధితురాలు, వారు చెప్పినట్టు పలు ఖాతాలకు విడతలవారీగా రూ. 2.5 లక్షల వరకు బదిలీ చేసింది. అక్టోబర్ 5న ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అక్టోబర్ 6న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అక్టోబర్ 10, శుక్రవారం రోజున కుమ్రార్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై ఆమె మృతదేహాన్ని గుర్తించారు. అయితే, ఇది ఆత్మహత్య కాదని, హత్యేనని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. తమ ఫిర్యాదుపై పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే తమ కుమార్తె బతికేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి ఫోన్ కాల్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీలను పరిశీలిస్తున్నారు. ఢిల్లీ, కేరళ, ఉత్తరప్రదేశ్‌లోని బ్యాంకు ఖాతాలకు డబ్బులు బదిలీ అయినట్లు గుర్తించారు. కాగా, యువతి మృతదేహానికి 200 మీటర్ల దూరంలో మరో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కూడా లభ్యం కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ రెండు మరణాలకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలోనూ విచారణ జరుపుతున్నారు.

## 'కామ్రేడ్ కల్యాణ్' షూటింగ్‌లో ప్రమాదం.. తృటిలో తప్పించుకున్న శ్రీకాంత్ అయ్యంగార్

- కామ్రేడ్ కల్యాణ్ షూటింగ్‌లో నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌కు ప్రమాదం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** సినిమాలో నటీనటులు తెరపై కనిపించేంత గ్లామర్‌గా వారి జీవితం ఉండదు. ఒక్కోసారి ప్రాణాలను పణంగా పెట్టి సాహసోపేతమైన సన్నివేశాల్లో నటించాల్సి వస్తుంది. తాజాగా విడుదలైన 'కామ్రేడ్ కల్యాణ్' చిత్ర షూటింగ్ సమయంలో సీనియర్ నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌కు జరిగిన ఓ ప్రమాదానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో చూసిన వారంతా ఆయన తృటిలో పెను ప్రమాదం నుంచి బయటపడ్డారని ఊపిరి పీల్చుకుంటున్నారు.

**అసలేం జరిగిందంటే..:**

శ్రీ విష్ణు హీరోగా నటించిన 'కామ్రేడ్ కల్యాణ్' అక్టోబర్ 9న విడుదలై మంచి టాక్‌తో ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం పంచుకున్న ఓ మేకింగ్ వీడియో అందరినీ షాక్‌కు గురిచేస్తోంది. ఈ ఘటన 2025 ఫిబ్రవరిలో మంగళూరు అడవుల్లో చిత్రీకరణ జరుపుకుంటున్నప్పుడు చోటుచేసుకుంది. ఓ ఎత్తైన వంతెనపై యాక్షన్ సన్నివేశం చిత్రీకరిస్తుండగా, శ్రీకాంత్ అయ్యంగార్ అదుపుతప్పి కిందకు జారిపడబోయారు. క్షణకాలంలో స్పందించిన హీరో శ్రీ విష్ణు, సమర్పకుడు కోన వెంకట్, దర్శకుడు జానకీరామ్ మారెళ్లతో పాటు అక్కడున్న సిబ్బంది వెంటనే ఆయనను పట్టుకుని పైకి లాగారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

ఈ వీడియోను శ్రీకాంత్ అయ్యంగార్ స్వయంగా సోషల్ మీడియాలో పంచుకుంటూ, "ఇది నాకు పునర్జన్మ లాంటిది. ఒక సినిమా కోసం ఎన్ని రిస్కులు, కష్టాలు పడాలో చెప్పలేం" అని పేర్కొన్నారు. ఈ ఘటనపై చిత్ర సమర్పకుడు కోన వెంకట్ కూడా భావోద్వేగంగా స్పందించారు. "మా నటీనటులు ప్రాణాలు పణంగా పెట్టి నటిస్తారు. సినిమాయే ప్రాణంగా బతుకుతాం. ఆ సినిమాను మీరు ఆదరించి బ్లాక్‌బస్టర్ చేస్తే, మాకు పునర్జన్మ వచ్చినట్లు అనిపిస్తుంది. ఈ విజయంతో మా శ్రీకాంత్‌కు, మాకు ఎంతో సంతోషం కలిగింది" అని ఆయన తన పోస్టులో రాసుకొచ్చారు.

నక్సలిజం నేపథ్యంతో కూడిన కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన 'కామ్రేడ్ కల్యాణ్' చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించారు. సినిమా విజయం సాధించిన తరుణంలో బయటకు వచ్చిన ఈ వీడియో, ఒక సినిమా రూపకల్పన వెనుక ఉండే శ్రమను, ప్రమాదాలను కళ్లకు కడుతోంది.

## తిరుమల శ్రీవారి దసరా బ్రహ్మోత్సవాల పూర్తి షెడ్యూల్

- అధికమాసం రావడంతో ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు
- ఇటీవలే ముగిసిన సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- అక్టోబరు 12 నుంచి 20 వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- అక్టోబరు 16న గరుడ వాహన సేవ, 20న చక్రస్నానం
- ధ్వజారోహణం, ధ్వజావరోహణం లేకుండా జరిగే ఉత్సవాలు



**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్):** తిరుమల పుణ్యక్షేత్రం మరో ఉత్సవానికి సిద్ధమైంది. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. అధికమాసం రావడం వల్ల ఈ ఏడాది స్వామివారికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే భాద్రపద మాసంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగియగా, దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆశ్వయుజ మాసంలో ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. అక్టోబరు 11న అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

సాధారణంగా చాంద్రమానం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అధికమాసం వస్తుంది. ఇలా వచ్చినప్పుడు కన్యామాసంలో (భాద్రపదం) వార్షిక బ్రహ్మోత్సవాలు, ఆశ్వయుజ మాసంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం తిరుమల సంప్రదాయం. ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఒక ప్రత్యేకత ఉంది. వార్షిక బ్రహ్మోత్సవాల తరహాలో వీటికి ధ్వజారోహణం, ధ్వజావరోహణం వంటి ఘట్టాలు ఉండవు. అంకురార్పణతో నేరుగా ఉత్సవాలు ప్రారంభమై, చక్రస్నానంతో పరిసమాప్తం అవుతాయి.

ఈ ఉత్సవాల్లో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఎదురుచూసే గరుడ వాహన సేవ అక్టోబరు 16న జరగనుంది. అలాగే, అక్టోబరు 17న పుష్పక విమానం, 19న స్వర్ణరథం ఊరేగింపు, 20న చక్రస్నానం ఘట్టాలు వైభవంగా జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం వాహన సేవలు 8 గంటల నుంచి 10 గంటల వరకు, రాత్రి సేవలు 7 గంటల నుంచి 9 గంటల వరకు జరుగుతాయి. అయితే, గరుడ వాహన సేవ మాత్రం అక్టోబరు 16న సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు విశేషంగా నిర్వహిస్తారు.

**నవరాత్రి బ్రహ్మోత్సవాల పూర్తి షెడ్యూల్:**

అక్టోబరు 12: బంగారు తిరుచ్చి ఉత్సవం (ఉదయం 9 గంటలకు), పెద్దశేష వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 13: చిన్నశేష వాహనం (ఉదయం 8 గంటలకు), హంస వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 14: సింహ వాహనం (ఉదయం 8 గంటలకు), ముత్యపుపందిరి వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 15: కల్పవృక్ష వాహనం (ఉదయం 8 గంటలకు), సర్వభూపాల వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 16: మోహినీ అవతారం (ఉదయం 8 గంటలకు), గరుడ వాహనం (సాయంత్రం 6.30 గంటలకు)

అక్టోబరు 17: హనుమంత వాహనం (ఉదయం 8 గంటలకు), పుష్పక విమానం (సాయంత్రం 4 గంటలకు), గజ వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 18: సూర్యప్రభ వాహనం (ఉదయం 8 గంటలకు), చంద్రప్రభ వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 19: స్వర్ణరథం (ఉదయం 7 గంటలకు), అశ్వ వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 20: చక్రస్నానం (ఉదయం 6 గంటలకు)

అక్టోబరు 20వ తేదీన ఉదయం 6 గంటలకు శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం మహోత్సవంతో ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగుస్తాయి. ఈ తొమ్మిది రోజుల పాటు శ్రీవారు వివిధ వాహనాలపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేయనున్నారు.

## ఏపీ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించిన మెగాస్టార్

- తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించిన చిరంజీవి
- రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని వ్యాఖ్య
- పవన్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖకు దేశంలో మొదటి ర్యాంక్ వచ్చిందని వెల్లడి
- ప్రజలకు ఇలాగే మంచి జరగాలని ఆకాంక్ష



**కపిలేశ్వరపురం (జర్నలిస్ట్ ఫైల్):** మెగాస్టార్ చిరంజీవి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి కనిపిస్తోందని ఆయన కితాబిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా, కపిలేశ్వరపురం పర్యటన సందర్భంగా ఆయన స్థానికులతో ముచ్చటించారు. ఈ క్రమంలో ఏపీలో పాలన గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

చాలా కాలం తర్వాత రాష్ట్రానికి వచ్చానని, ఇక్కడ పాలన ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకున్నానని చిరంజీవి చెప్పారు. రాష్ట్రంలో ఎన్నో మంచి మార్పులు వచ్చాయని ప్రజలు తనకు చెప్పినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

ముఖ్యంగా తన సోదరుడు పవన్ కల్యాణ్ నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ శాఖ పనితీరును ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతంలో దేశవ్యాప్తంగా 23వ ర్యాంకులో ఉన్న పంచాయతీరాజ్ శాఖ, ఇప్పుడు మొదటి స్థానానికి చేరుకోవడం గర్వకారణమని అన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పరోక్షంగా సూచించారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఇలాగే మంచి జరగాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నట్లు చిరంజీవి తెలిపారు.

తూర్పు గోదావరి జిల్లా కపిలేశ్వరపురంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జీఎస్ఎల్ హాస్పిటల్, సూర్య ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్మించిన వైద్య కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం చిరంజీవి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్యాన్సర్ వ్యాధి ముదిరిన తర్వాతే చాలామంది మేల్కొంటున్నారని, లక్షణాలను ముందుగా గుర్తిస్తే సులభంగా కోలుకోవచ్చని సూచించారు. తన భార్య, సోదరి, తల్లికి క్రమం తప్పకుండా క్యాన్సర్ పరీక్షలు చేయిస్తానని తెలిపారు. ముఖ్యంగా మహిళలు బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు.

నటుడు మురళీమోహన్ ఆరోగ్యాన్ని చూశాక, తాను కూడా మరింత జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించానని చిరంజీవి పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టాన్ని వివరిస్తూ, తాను హైదరాబాద్ నుంచి గాజు వాటర్ బాటిళ్లను తెచ్చుకుంటానని చెప్పారు. ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల గుండెపోటు ప్రమాదం పెరుగుతుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమానికి చిరంజీవి హాజరవడంతో మెగా అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన్ను చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ ఛైర్మన్ గన్ని భాస్కర్ రావు, సూర్య ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు జీవీబీ చౌదరి, పలువురు మంత్రులు, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నానా పటేకర్ మృతిపై వీడిన సస్పెన్స్.. గుండెపోటుతోనే మరణం

- నానా పటేకర్ మృతిపై క్లారిటీ ఇచ్చిన పోస్ట్‌మార్టం నివేదిక
- తీవ్రమైన గుండెపోటు కారణంగానే ఆయన మరణించినట్లు నిర్ధారణ
- అనుమానాస్పద మృతి కేసును మూసివేయనున్న గోవా పోలీసులు
- పుణేలో గురువారం ప్రభుత్వ లాంఛనాలతో జరిగిన నానా అంత్యక్రియలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రముఖ నటుడు నానా పటేకర్ మృతికి సంబంధించిన సస్పెన్స్‌కు తెరపడింది. ఆయన మరణం సహజమైనదేనని, తీవ్రమైన గుండెపోటు కారణంగానే ప్రాణాలు కోల్పోయారని తుది పోస్ట్‌మార్టం నివేదిక స్పష్టం చేసింది.

గోవా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వైద్యుల బృందం ఈ నివేదికను గోవా పోలీసులకు అందజేసింది. ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన ధమనిలో రక్తం గడ్డకట్టడంతో గుండెపోటు సంభవించి నానా పటేకర్ మరణించారు.

పోస్ట్‌మార్టం నివేదిక వివరాలను కుటుంబ సభ్యులకు తెలియజేయగా, వారు కూడా అంగీకరించారని, ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని పోలీసులు పేర్కొన్నారు. అక్టోబర్ 8వ తేదీ తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో నానా పటేకర్ తన కుటుంబ స్నేహితుడికి వాట్సాప్ ద్వారా అనారోగ్యంగా ఉన్నట్లు సందేశం పంపారు. వెంటనే దోనా పౌలాలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు సుమారు 45 నిమిషాల పాటు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో, ఆయన అప్పటికే మరణించినట్లు ప్రకటించారు. ఈ ఘటనపై పనాజీ పోలీసులు మొదట భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 194 కింద అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే, తాజా పోస్ట్‌మార్టం నివేదికతో ఆయన మరణం సహజమైనదేనని తేలడంతో పాటు, కుమారుడు మల్హార్ పటేకర్, మేనల్లుడు ప్రసాద్ పటేకర్‌పై ఎలాంటి అనుమానాలకు తావులేదని స్పష్టమైంది. దీంతో పోలీసులు త్వరలోనే ఈ కేసును మూసివేయనున్నారు. నానా పటేకర్ అంత్యక్రియలు గురువారం పుణే జిల్లాలోని డోంజే గ్రామంలో ఉన్న ఆయన ఫామ్‌హౌస్‌లో ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి.

పోలీసులు మూడు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. ఈ అంతిమయాత్రకు సినీ పరిశ్రమ నుంచి జాకీ ష్రాఫ్, దర్శకులు అనిల్ శర్మ, అనీస్ బాజ్మీ, నిర్మాత ఫిరోజ్ నడియాడ్‌వాలా వంటి ప్రముఖులు హాజరై నివాళులు అర్పించారు.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కూడా ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. తమ అభిమాన నటుడిని కడసారి చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు.

## మహారాష్ట్రలో 2.7 లక్షల ఓటర్ల వయసు సవరణ

- ఓటర్ల జాబితాపై అభ్యంతరాలకు అక్టోబర్ 12 వరకు గడువు
- ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సీఎం విజ్ఞప్తి
- నవంబర్ 16న తుది ఓటర్ల జాబితా విడుదల




**మహారాష్ట్ర (జర్నలిస్ట్ ఫైల్):** మహారాష్ట్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.7 లక్షల మంది ఓటర్ల వయసులో ఉన్న పొరపాట్లను శనివారం సరిదిద్దింది. మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) ఎస్. చొక్కలింగం చేసిన ప్రత్యేక విజ్ఞప్తి మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ చర్యలు చేపట్టింది.

అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ గడువు ముగియకముందే ఈ సవరణలు పూర్తి చేయడంతో ఓటర్లు తమ వయసు మార్పు కోసం ఇకపై ఫారం-8 సమర్పించాల్సిన అవసరం లేదు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఎస్ఆర్) కింద అభ్యంతరాలు తెలిపేందుకు గడువును అక్టోబర్ 12 వరకు పొడిగించారు. ఈ నోటీసులు, అభ్యంతరాల పరిశీలన ప్రక్రియ నవంబర్ 10 వరకు కొనసాగనుంది. అనంతరం, నవంబర్ 16న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు.

జాబితాలో తప్పులు లేదా పత్రాల అసంబద్ధత కారణంగా మొత్తం 1.22 కోట్ల మంది ఓటర్లకు నోటీసులు జారీ అయ్యాయి. పత్రాలను సమర్పించేందుకు ప్రజలు నేరుగా కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా, వాట్సాప్ ద్వారా పంపే వెసులుబాటును అధికారులు కల్పించారు. మరోవైపు, ముసాయిదా జాబితా నుంచి తొలగించిన 1.51 కోట్ల మంది ఓటర్లలో ఇప్పటివరకు కేవలం 3.9 లక్షల మంది మాత్రమే తిరిగి నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, వారాంతాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వలసలు, జనాభా మార్పుల దృష్ట్యా ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు) సైతం ఇంటింటికీ

## నిరుద్యోగులకు శుభవార్త.. రైల్వేలో 3,548 ఉద్యోగాలకు నోటిఫికేషన్

- రైల్వేలో గ్రాడ్యుయేట్ లెవల్ ఎన్టీపీసీ పోస్టులకు నోటిఫికేషన్
- గూడ్స్ ట్రైన్ మేనేజర్, సీనియర్ క్లర్క్ సహా పలు ఉద్యోగాల భర్తీ
- నవంబర్ 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం
- కంప్యూటర్ ఆధారిత పరీక్షల ద్వారా అభ్యర్థుల ఎంపిక
- 18 నుంచి 33 ఏళ్ల వయసున్న డిగ్రీ అభ్యర్థులు అర్హులు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ రైల్వే నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. నాన్-టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (ఎన్టీపీసీ - గ్రాడ్యుయేట్) కింద 3,548 ఉద్యోగాల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) ఆదివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. రైల్వే కార్యకలాపాలు, పరిపాలనలోని వివిధ విభాగాల్లో పనిచేసేందుకు గ్రాడ్యుయేట్లకు ఇది ఒక గొప్ప అవకాశమని ప్రకటనలో పేర్కొంది.

ఈ రిక్రూట్‌మెంట్ ద్వారా మొత్తం నాలుగు కేటగిరీలలో పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో అత్యధికంగా 2,750 గూడ్స్ ట్రైన్ మేనేజర్ పోస్టులు ఉండగా, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులు 371, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్ పోస్టులు 300, చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్ పోస్టులు 127 ఉన్నాయి. కమర్షియల్, ట్రైన్ ఆపరేషన్స్, అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో ఈ నియామకాలు చేపట్టనున్నారు.

ఎంపికైన అభ్యర్థులకు ఏడవ కేంద్ర వేతన సంఘం (7వ సీపీసీ) సిఫార్సుల ప్రకారం వేతనాలు ఉంటాయి. చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్ పోస్టుకు పే లెవల్ 6 కింద రూ. 35,400 ప్రారంభ మూల వేతనం లభిస్తుంది. మిగిలిన మూడు కేటగిరీల (గూడ్స్ ట్రైన్ మేనేజర్, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్, సీనియర్ క్లర్క్) పోస్టులకు పే లెవల్ 5 కింద రూ. 29,200 ప్రారంభ మూల వేతనం ఉంటుంది. వీటికి అదనంగా ఇతర అలవెన్సులు కూడా వర్తిస్తాయి.

అక్టోబర్ 8న ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ, నవంబర్ 6 రాత్రి 11:59 గంటలకు ముగుస్తుంది. పరీక్ష ఫీజు చెల్లించడానికి నవంబర్ 8 చివరి తేదీ కాగా, దరఖాస్తులో మార్పులు చేసుకునేందుకు నవంబర్ 9 నుంచి 18 వరకు అవకాశం కల్పించారు.

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2027 జనవరి 1 నాటికి అభ్యర్థుల వయసు 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి. నిబంధనల ప్రకారం రిజర్వ్ కేటగిరీల అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపులు ఉంటాయి.

రెండు దశల కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ), ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అయితే, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్, సీనియర్ క్లర్క్ పోస్టులకు తప్పనిసరి అయిన కంప్యూటర్ బేస్డ్ టైపింగ్ స్కిల్ టెస్ట్‌ను ఈసారి మినహాయించినట్లు రైల్వే తెలిపింది. ఉద్యోగంలో చేరిన తర్వాత వారి టైపింగ్ నైపుణ్యాన్ని పరిశీలిస్తారని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఖాళీల పూర్తి వివరాలు, అర్హతలు, రిజర్వేషన్ల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ rrb.indianrailways.gov.in ను సందర్శించాలని రైల్వే శాఖ సూచించింది.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com